విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729
ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily



సంపుటి : 3 | సంచిక : 299 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 22 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03
Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## ఎల్పీజీ కేటాయింపు పెంచుతున్నాం... హోటళ్లకు ఇవ్వండి

- వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లలో అదనంగా 20 శాతం కేటాయించేందుకు ఆమోదం
- హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్న కేంద్రం
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పెట్రోలియం శాఖ కార్యదర్శి లేఖ

వాణిజ్య సిలిండర్లపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాణిజ్య సిలిండర్లను అదనంగా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించడానికి చర్యలు చేపట్టిన కేంద్రం, ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లలో అదనంగా 20 శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఈ చర్యతో ఓవరాల్ కేటాయింపులు 50 శాతానికి చేరుకున్నట్టయింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పెట్రోలియం శాఖ కార్యదర్శి లేఖ రాశారు. వాణిజ్య సిలిండర్లకు సంబంధించి హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, సబ్సిడీ ఆహార

- మిగతా 2లో



## విమాన ప్రయాణికులపై యుద్ధ ప్రభావం పడనివ్వం

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

- విమాన ఇంధనం ధరల భారాన్ని బదిలీ చేయబోవడంలేదని రామ్మోహన్ నాయుడు స్పష్టం
- విమానాల్లో 60 శాతం సీట్లను ఉచితంగా ఎంచుకునే వెసులుబాటు
- ప్రయాణికుల హక్కులు, పరిహారంపై ప్రాంతీయ భాషల్లో ప్రచారం
- క్రీడా పరికరాలు, పెంపుడు జంతువుల తరలింపుపై కొత్త మార్గదర్శకాలు

- మిగతా 2లో





## కేరళలో షిగెల్లా కలకలం

### ఒక చిన్నారి మృతి

### 12 మందికి సోకిన వ్యాధి

కేరళలోని కోళికోడ్ జిల్లాలో షిగెల్లా వ్యాధి కలకలం రేపుతోంది. పెరువయల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎరంజికల్ ప్రాంతంలో 12 మందికి ఈ వ్యాధి సోకినట్లు నిర్ధరణ కావడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. కొద్ది రోజుల క్రితం

- మిగతా 2లో

## తిరుమల పవిత్రతను పరిరక్షిస్తాం

- భక్తుల విశ్వాసాన్ని కాపాడతాం
- సీఎం చంద్రబాబు
- మనవడు దేవాంశ్ పుట్టినరోజు సందర్భంగా శ్రీవారి దర్శనం
- వెంగమాంబ సత్రంలో భక్తులకు స్వయంగా అన్నప్రసాద వితరణ



శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. భక్తుల మనోభావాలకు ప్రాధాన్యమిస్తూ సేవలందించాలని తితిదే అధికారులకు స్పష్టం చేశారు. తితిదే ఆధ్వర్యంలోని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. లడ్డూప్రసాదం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని స్పష్టం చేశారు. మనవడు దేవాంశ్ పుట్టినరోజు సందర్భంగా శనివారం సీఎం కుటుంబసమేతంగా శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)ను సీఎం పరిశీలించారు. భక్తులు క్యూలైన్లోకి ప్రవేశించినప్పటి నుంచి తిరిగి వెళ్లేవరకు వారికి అందే సౌకర్యాలను ఇక్కడి నుంచే పర్యవేక్షించాలని, అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థలు వాడాలని సూచించారు. లడ్డూల తయారీ, విక్రయాలు, నిల్వలను సైతం సమగ్రంగా పర్యవేక్షించేలా కార్యా ఫౌండేషన్ ద్వారా అందుతున్న సేవలను అమెరికా నుంచి దాత వేజెండ్ల జయప్రసాద్ వర్చువల్‌గా సీఎంకు వివరించారు.

### శ్రీవారి ప్రసాదం.. ఇక కల్తీ రహితం

స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ, తితిదే సంయుక్తంగా రూ. 25 కోట్లతో నిర్మించిన అత్యాధునిక ల్యాబరేటరీని సీఎం ప్రారంభించారు. దిల్లీ నుంచి వచ్చిన ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాండా, సీఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ గిరిధర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. ఉషారాణి

- మిగతా 2లో

## నంది అవార్డులపై కీలక ప్రకటన చేసిన ఏపీ మంత్రి కందుల దుర్గేశ్

- ఏపీలో త్వరలోనే నంది అవార్డుల పునఃప్రారంభం
- కీలక వివరాలు వెల్లడించిన మంత్రి కందుల దుర్గేశ్
- కళాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ
- విశాఖను సినిమా హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటన
- చిరంజీవి వ్యాఖ్యల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్న నిర్ణయం



ఆంధ్రప్రదేశ్‌లో కొంతకాలంగా నిలిచిపోయిన ప్రతిష్ఠాత్మక నంది అవార్డులను త్వరలోనే పునఃప్రారంభిస్తామని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటకం, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేశ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక ప్రకటన చేశారు. చలనచిత్ర, టీవీ, నాటక రంగాలకు చెందిన కళాకారులకు గౌరవం, గుర్తింపు అందించడంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. విశాఖపట్నంలో

- మిగతా 2లో



## వచ్చే వారం దాడులు మరింత తీవ్రతరం

పశ్చిమాసియాలో యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై దాడుల తీవ్రత రానున్న వారం మరింత పెరగనుందని చెప్పారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే కట్జ్

- మిగతా 2లో

## నాణ్యత ఫలితాలు మార్చేయకుండా బ్లాక్‌చైన్ భద్రత

- రూ.25 కోట్లతో తిరుమలలో స్టేట్ ఫుడ్ ల్యాబ్ ప్రారంభం
- మంత్రి సత్యకుమార్ యాదవ్

: శ్రీవారి ప్రసాదాల తయారీలో వినియోగించే ముడిసరకుల నాణ్యతలో అక్రమాలకు, కల్తీకి తావు లేకుండా అత్యాధునిక సాంకేతికతను వినియోగించనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు.

- మిగతా 2లో





## ముగిస్తాం.. విరుచుకుపడతాం

- యుద్ధంపై అమెరికా, ఇజ్రాయెల్ చెరో మాట
- ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై వైమానిక దాడులు
- డిగో గార్సియాపైకి క్షిపణులు ప్రయోగించిన టెహ్రాన్
- ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తేసిన అమెరికా
- హర్మూజ్‌ను తెరవండి.. 22 దేశాల విజ్ఞప్తి

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధ కల్లోలం చల్లారట్లేదు. ఓ వైపు అమెరికా-ఇజ్రాయెల్ విరుచుకు పడుతుంటే.. ఇరాన్ అంతే స్థాయిలో ప్రతిఘటిస్తోంది. శనివారం.. తమ దేశానికి దాదాపు 4 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రిటన్-అమెరికా సంయుక్త సైనిక స్థావరం డిగో గార్సియాపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి పాశ్చాత్య దేశాల్ని కలవరపాటుకు గురిచేసింది. ఈ దాడి యత్నం ద్వారా సుదీర్ఘ దూరంలోని లక్ష్యాలనూ ఢీ కొట్టగలమన్న సంకేతాన్ని పంపింది.

- మిగతా 2లో

## తితిదే ఆలయాలను అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి



తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పరిధిలోని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తితిదే బోర్డు సభ్యులకు సూచించారు. తిరుమలలో పర్యటించిన సీఎం.. శనివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని

- మిగతా 2లో

## రాజమండ్రి కల్తీపాల ఘటన.. మరొకరు మృతి

రాజమండ్రి కల్తీపాల విషాద ఘటనలో మరొకరు మృతి చెందారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో ఫిబ్రవరిలో వెలుగుచూసిన కల్తీపాల ఘటన ఇంకా బాధితులను వెంటాడుతూనే ఉంది. తాజాగా రాజేంద్రనగర్‌కు చెందిన పిచ్చుక నాగేశ్వరరావు(72) అనే వ్యక్తి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశారు. ఫిబ్రవరి 16న కల్తీపాలు తాగిన ఆయన, అప్పటి నుండి తీవ్ర అస్వస్థతతో కిడ్నీలు దెబ్బతిని

- మిగతా 2లో



# తిరుమల పవిత్రతను పరిరక్షిస్తాం

-మొదటిపేజీ తరువాయి
అందులోని 50కి పైగా పరికరాల పనితీరును వివరించారు. ఓ ఆలయం కోసం అత్యున్నత ప్రమాణాలతో ల్యాబ్ ఏర్పాటు చేయడం దేశంలోనే ఇదే తొలిసారని సీఎం పేర్కొన్నారు. అయోధ్యలో తిరుమల తరహా లడ్డూ తయారీకి ఇక్కడి వారిని పంపినా ఆ రుచి రాలేదని, శ్రీవారి ఆశీస్సులతోనే ఇక్కడి ప్రసాదానికి అంతటి విశిష్టత ఉందని.. ఆ నమ్మకాన్ని అధికారులు నిలబెట్టాలని సీఎం పేర్కొన్నారు.

తితిదే–ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్ పనితీరును సీఎంకు వివరిస్తున్న ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.ఉషారాణి. చిత్రంలో వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో రవిచంద్ర తదితరులు

**అన్నదానానికి రూ.44 లక్షల విరాళం**

చంద్రబాబు సామాన్య భక్తుడిలా కుటుంబంతో కలిసి శనివారం ఉదయం వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. మహాద్వారం వద్ద తితిదే అధికారులు, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం సీఎం కుటుంబానికి వేదాశీర్వచనం, స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. మనవడు దేవాంశ్ పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్‌లతో కలిసి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. వారితో కలిసి భోజనం చేశారు. దేవాంశ్ పుట్టినరోజు సందర్భంగా తిరుమలలో ఒక్కరోజు అన్నప్రసాద వితరణ ఖర్చు కింద మంత్రి లోకేశ్ రూ.44 లక్షలు విరాళంగా అందించారు. ఇలా విరాళం ఇవ్వడం ఇది 12వ సారి. స్వామి దర్శనానంతరం ఆలయం నుంచి అతిథిగృహానికి వెళ్లే మార్గంలో చంద్రబాబు భక్తులను ఆప్యాయంగా పలకరించారు. మాడవీధుల్లోని లేపాక్షి కూడలి వద్ద సీఎంను చూసి భక్తులు ఉత్సాహం వ్యక్తం చేశారు. తనను చూసేందుకు వచ్చిన ముగ్గురు చిన్నారులను ఎత్తుకుని సీఎం ముద్దాడారు. ఓ దివ్యాంగుడి వద్దకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

**తితిదే సేవలను సమర్థంగా నిర్వహించాలి**

తితిదే సేవా కార్యక్రమాలపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్షించారు. తితిదే అనుబంధ వైద్య సంస్థలైన స్విమ్స్, బర్డ్, శ్రీపద్మావతి హృదయాలయంలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రాణదాన పథకాన్ని విస్తృతపరచాలన్నారు. తితిదే సహా దాని పరిధిలోని 57 దేవాలయాల్లో ప్రస్తుతం అన్నప్రసాద వితరణ జరుగుతోందని, మరో నాలుగింటిలో త్వరలోనే ప్రారంభించనున్నామని అధికారులు చెప్పారు. ధర్మప్రచారంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.750 కోట్లతో 5వేల నూతన ఆలయాల నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో సంబంధిత ప్రణాళికలపై సీఎం కొన్ని సూచనలు చేశారు. దేశ రాజధానిలోనూ శ్రీవారి ఆలయం తరహాలో ఉండేలా నిర్మాణ ప్రతిపాదనలపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో మంత్రులు సత్యకుమార్, అనగాని సత్యప్రసాద్, సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న, తితిదే ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, బోర్డు సభ్యులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ముగిస్తాం.. విరుచుకుపడతాం

-మొదటిపేజీ తరువాయి
మరోవైపు ఇరాన్‌లోని కీలక అణుశుద్ధి కేంద్రమైన నతాంజ్‌పై శనివారం అమెరికా బాంబుల వర్షం కురిపించింది. ఈ కేంద్రంపై గతేడాది జరిగిన 12 రోజుల యుద్ధంలోనూ అమెరికా తీవ్రస్థాయిలో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడులు.. ప్రతిదాడుల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. యుద్ధాన్ని ముగించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తాము చేపట్టిన సైనిక చర్యలు అనుకున్న లక్ష్యానికి చేరువయ్యాయని చెప్పారు.

ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే.. వచ్చే వారం ఇరాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడతామంటూ ఇజ్రాయెల్ భిన్నమైన ప్రకటన చేయడం గమనార్హం. "ఇరాన్‌పై దాడులు మరింత ముమ్మరం కానున్నాయి. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ భద్రతకు, అమెరికా ప్రయోజనాలకు పొంచి ఉన్న ముప్పు తొలగిపోయే వరకు.. ఆ దేశ పాలనాయంత్రాంగాన్ని, కమాండర్లను, వ్యూహాత్మక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటాం. యుద్ధ లక్ష్యాలన్నీ సాధించే వరకు విశ్రమించేది లేదు" అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ పేర్కొన్నారు. ముడి చమురు ధరల నియంత్రణపై దృష్టిపెట్టిన ట్రంప్ యంత్రాంగం ఇరాన్ చమురు విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశ చమురుపై గతంలో విధించిన ఆంక్షలను తాత్కాలికంగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది.

**మరోసారి నతాంజ్‌పై..**

నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై వైమానిక దాడులు జరిగాయని ఇరాన్ శనివారం ప్రకటించింది. అయితే అణుకేంద్రం నుంచి ఎలాంటి రేడియేషన్ వెలువడలేదని పేర్కొంది. దాడి సమాచారాన్ని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ)కు అందించినట్లు పేర్కొంది. అయితే తాము దాడి చేయలేదని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. అమెరికా చేసిందా లేదా అన్న విషయంపై స్పష్టతివ్వలేదు. నతాంజ్‌పై ఈ నెల తొలివారంలోనూ దాడి జరిగింది. ఈ అణుకేంద్రంపై దాడిని రష్యా ఖండించింది. ఇది అంతర్జాతీయ న్యాయసూత్రాలను ఉల్లంఘించడమేనని పేర్కొంది.

**ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రం**
**క్షిపణి సామర్థ్యాలను నాశనం చేశాం**

ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ పోస్టు పెట్టారు. ఇరాన్‌పై సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నౌకా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరించారు.

**ఆంక్షల ఎత్తివేత తాత్కాలికమే**

ఇరాన్‌పై తీవ్రస్థాయిలో దాడులు చేస్తున్న అమెరికా ఆ దేశ చమురుపై తాత్కాలికంగా ఆంక్షలను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల 19 వరకు ఇరాన్ చమురును ఏ దేశమైనా దిగుమతి చేసుకోవచ్చని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. ఇప్పటికే నౌకల్లో ఉన్న ఇరాన్ చమురుకు మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుందని స్పష్టంచేశారు. యుద్ధం కారణంగా పెరుగుతున్న ముడి చమురు ధరలను నియంత్రించడానికి అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఆ నేపథ్యంలోనే ఇటీవల రష్యా చమురుపైనా ఆంక్షలు తాత్కాలికంగా ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. అమెరికా నిర్ణయంపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు చమురు లేదని స్పష్టం చేసింది. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకు, కొనుగోలుదారులకు భరోసా ఇవ్వడం కోసం అమెరికా ఈ ప్రకటన చేసిందని ఆరోపించింది.

**టెహ్రాన్, బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడులు**

ఇరాన్ రాజధాని టెహ్రాన్, లెబనాన్ రాజధాని బీరుట్‌లపై శనివారం ఇజ్రాయెల్ దాడులు నిర్వహించింది. సెంట్రల్ బీరుట్‌లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో ఇప్పటివరకు 1000 మంది ప్రాణాలు కోల్పోయారు. 10 లక్షల మందికి పైగా పౌరులు నిరాశ్రయులయ్యారు.

ఇజ్రాయెల్ తమ నిఘా కేంద్ర కార్యాలయంపై దాడి చేసి ఓ అధికారిని హతమార్చిందని ఇరాన్ పేర్కొంది.

ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు శనివారమూ కొనసాగాయి. టెహ్రాన్ క్షిపణి దాడిలో చిన్న పిల్లల పాఠశాల భవనమొకటి దెబ్బతిందని ఇజ్రాయెల్ పేర్కొంది. ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడించింది.

ఇజ్రాయెల్‌లోని దిమోనాపై ఇరాన్ శనివారం సాయంత్రం జరిపిన క్షిపణి దాడిలో 21 మంది గాయపడ్డారు. ఇరాన్ క్షిపణి నేరుగా ఓ భవంతిని తాకడంతో అది ధ్వంసమైంది.

బహ్రెయిన్ రాజధాని మనామాపై ఇరాన్ క్షిపణులు ప్రయోగించినట్లు తెలుస్తోంది. మనామాలో బాంబుల శబ్దాలు వినిపించాయని స్థానికులు పేర్కొన్నారు.

ఇరాన్ ప్రయోగించిన మూడు బాలిస్టిక్ క్షిపణులను, 8 డ్రోన్లను అడ్డుకున్నామని యూఏఈ రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది.

తమ చమురు క్షేత్రాలపైకి దూసుకొస్తున్న 20 డ్రోన్లను

## వచ్చే వారం దాడులు మరింత తీవ్రతరం

-మొదటిపేజీ తరువాయి
ఈమేరకు వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

"ఇరాన్ పై దాడులు మరింత ముమ్మరం కానున్నాయి. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ భద్రతకు, అమెరికా ప్రయోజనాలకు పొంచి ఉన్న ముప్పు తొలగిపోయే వరకు.. ఆ దేశ పాలనాయంత్రాంగం, కమాండర్లు, వ్యూహాత్మక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటాం. యుద్ధ లక్ష్యాలన్నీ సాధించే వరకు విశ్రమించేది లేదు" అని సైనిక అధికారులతో సమీక్ష సందర్భంగా కట్జ్ అన్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇరాన్ నుంచి అణుముప్పును తొలగించడం, దాని సైనిక సామర్థ్యాలను దెబ్బతీయడం, ఆ దేశ ప్రజలకు స్వేచ్ఛ కల్పించడమే తమ లక్ష్యాలని అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్న విషయం తెలిసిందే.

**ఇరాన్ దుస్సాహసానికి పాల్పడింది: బ్రిటన్**

హిందూ మహాసముద్రంలోని డిగో గార్సియా ద్వీపంలో ఉన్న యూఎస్–యూకే సైనిక స్థావరం లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించడాన్ని బ్రిటన్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులను దుస్సాహసంగా పేర్కొంది. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు, హర్మూజ్ జలసంధిని మూసివేయడం వంటివి.. తమ ప్రయోజనాలకు, తమ మిత్రదేశాలకు ముప్పుగా బ్రిటన్ రక్షణశాఖ తెలిపింది.

**ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌కు ప్రధాని మోదీ ఫోన్**

ఇరాన్‌పై దాడుల్లో బ్రిటన్ ఇంతవరకు నేరుగా పాల్గొనలేదు. కానీ.. ఆ దేశంపై దాడుల కోసం అమెరికాకు తమ స్థావరాలను ఉపయోగించుకునేందుకు అనుమతించింది. హర్మూజ్ జలసంధిలో నౌకలపై ఇరాన్ దాడులను కట్టడి చేసేందుకు.. డిగో గార్సియా సహా ఇతర స్థావరాలను కూడా ఉపయోగించుకోవచ్చని శుక్రవారం తెలిపింది. బ్రిటన్ ఈ ప్రకటన చేయడానికి ముందే డిగో గార్సియా లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. ఈ ద్వీపం.. ఇరాన్ నుంచి దాదాపు 4,000 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీనికి ఎంత సమీపానికి క్షిపణులు వచ్చాయనేది తెలియరాలేదు.

## విమాన ప్రయాణికులపై యుద్ధ ప్రభావం పడనివ్వం

ప్రస్తుతం కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల ప్రభావం విమానయాన రంగంపై ఉన్నప్పటికీ, ఆ ఆర్థిక భారాన్ని ప్రయాణికులపై పడకుండా చూసేందుకు కట్టుబడి ఉన్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రయాణికుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.యుద్ధం కారణంగా విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలపై ప్రభావం కచ్చితంగా ఉంటుందని, అయితే ఆ భారాన్ని ప్రయాణికులకు బదిలీ చేయకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఈ విషయంపై పౌర విమానయాన, విదేశాంగ, పెట్రోలియం శాఖలతో కలిసి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నామని, విమానయాన సంస్థల నుంచి కూడా నిరంతరం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నామని ఆయన వివరించారు. దీంతో పాటు ప్రయాణికులకు అనుకూలంగా పలు కొత్త చర్యలను కూడా రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. ఇకపై విమానాల్లో 60 శాతం సీట్లను ఎలాంటి అదనపు రుసుము లేకుండా ఉచితంగా ఎంచుకునే వెసులుబాటు కల్పించాలని విమానయాన సంస్థలను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే, క్రీడా పరికరాలు, సంగీత వాయిద్యాలను తరలించే విషయంలో మరింత సరళంగా వ్యవహరించాలని, పెంపుడు జంతువుల ప్రయాణానికి సంబంధించి స్పష్టమైన విధానాలను ప్రవేశపెట్టాలని సూచించారు. విమానాల ఆలస్యం, రద్దు వంటి సందర్భాల్లో ప్రయాణికులకు అందాల్సిన పరిహారం, వారి హక్కులపై అవగాహన పెంచేందుకు ప్రాంతీయ భాషల్లోనూ విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. పశ్చిమాసియాలోని కొన్ని విమానాశ్రయాలు ప్రస్తుతానికి పనిచేయడం లేదని, అయినా కీలక మార్గాల్లో ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రయాణికుల సౌకర్యానికే తమ తొలి ప్రాధాన్యత అని ఆయన పునరుద్ఘాటించారు.

# కేరళలో షిగెల్లా కలకలం

-మొదటిపేజీ తరువాయి
నలుగురికి ఈ వ్యాధి సోకగా వారిలో ఒక చిన్నారి మృతి చెందింది. ఆరోగ్య శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగా పాజిటివ్ వచ్చిన వారిలో చాలా మంది ఇప్పటికే బాధిత కుటుంబ సభ్యులే. దీంతో వ్యాధి ఒకే ప్రాంతంలో వేగంగా వ్యాప్తి చెందుతున్నట్టు అధికారులు భావిస్తున్నారు. ఆరోగ్య శాఖ, గ్రామపంచాయతీ యంత్రాంగం అప్రమత్తమైంది. అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి పరిశీలనలు నిర్వహిస్తున్నాయి.

**ఏమిటీ షిగెల్లా?**

సూక్ష్మక్రిముల వల్ల కలిగే ఒక రకమైన అంటువ్యాధి షిగెల్లా. దీనిని షిగెల్లోసిస్ అని కూడా పిలుస్తారు. జీర్ణ వ్యవస్థను, ముఖ్యంగా పేగులను ప్రభావితం చేస్తుంది. కలుషిత ఆహారం, నీటిని తీసుకోవడం ద్వారా, ఇన్ఫెక్షన్‌కు గురైన వ్యక్తిని తాకడం ద్వారా ఇది సంక్రమిస్తుంది. విరేచనాలు (తరచుగా రక్తంతో కూడినవి), కడుపు నొప్పి, జ్వరం, వాంతులు దీని ముఖ్య లక్షణాలు. ఈ అంటువ్యాధి ఏ వయసు వారికైనా సోకవచ్చు. 5 ఏళ్లలోపు పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం, నీటిని తీసుకోవడం ద్వారా దీనిని నివారించవచ్చు.

## నంది అవార్డులపై కీలక ప్రకటన చేసిన ఏపీ మంత్రి కందుల దుర్గేశ్

-మొదటిపేజీ తరువాయి
సినిమా నిర్మాణానికి అనువైన లొకేషన్లు ఎన్నో ఉన్నాయని, వాటిని ప్రోత్సహించి నిర్మాణ సంస్థలను ఇక్కడికి ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి దుర్గేశ్ వివరించారు. కూటమి ప్రభుత్వం కళాకారుల అభివృద్ధికి, సినిమా రంగం బలోపేతానికి కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. నంది అవార్డుల ప్రదానోత్సవానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉద్ఘాటించారు.ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ... కళాకారులను ప్రోత్సహించడంలో పొరుగు రాష్ట్రమైన ఏపీ కొంత వెనుకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో తాజాగా మంత్రి కందుల దుర్గేశ్ నంది అవార్డులపై ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. నంది నాటకోత్సవాలను కూడా తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా ప్రకటనతో తెలుగు సినీ, నాటక రంగాల్లోని కళాకారుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. అవార్డుల ఎంపిక ప్రక్రియ, జ్యూరీ కూర్పు, దరఖాస్తుల ఆహ్వానం వంటి పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా వెలువడతాయని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి.

## ఎల్పీజీ కేటాయింపు పెంచుతున్నాం... హోటళ్లకు ఇవ్వండి

-మొదటిపేజీ తరువాయి
కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. ఆహార కేంద్రాలకు ఎలాంటి లోటు లేకుండా చూడాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించింది. చమురు కంపెనీల వద్ద రిజిస్టర్ అయిన వాణిజ్య సంస్థలతో పాటు పీఎన్జీ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటికి ఈ అదనపు కేటాయింపులు వర్తిస్తాయని తెలిపింది.

వలస కూలీలకు 5 కిలోల సిలిండర్లు అందజేయాలని, వాటిని సరఫరా చేస్తామని సూచించింది. ఎల్లుండి నుంచి సిలిండర్లు పంపిణీ చేస్తామని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు రాసిన లేఖలో కేంద్రం తెలిపింది. సిలిండర్లు పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని ఆదేశించింది.

## నాణ్యత ఫలితాలు మార్చేయకుండా బ్లాక్‌చైన్ భద్రత

-మొదటిపేజీ తరువాయి
నాణ్యత పరీక్షల ఫలితాలు తారుమారు (మానిప్యులేట్) చేయడానికి వీల్లేకుండా 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'ని ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. తిరుమలలో భారతీయ ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆధ్వర్యంలో సుమారు రూ.25 కోట్లతో ఏర్పాటు చేసిన స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. 'సీఎం సూచనతో కేంద్రం ఈ ప్రతిష్ఠాత్మక ల్యాబ్‌ను మంజూరు చేసింది. దీనికోసం తితిదే 12వేల చదరపు అడుగుల భవనం కేటాయించింది. ఈ ల్యాబ్‌లో అత్యంత సూక్ష్మ కల్తీని సైతం గుర్తించవచ్చు. నీటితోపాటు పాలు, నెయ్యి, నూనె, శనగలు, బాదంపప్పు, యాలకులు వంటి సరకుల నాణ్యతను ఇక్కడ పరీక్షిస్తారు. ఒకేసారి 400 రకాల పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్, యాడిటివ్స్, సింథటిక్ రంగులు గుర్తించే సామర్థ్యం దీని సొంతం. ముడిసరకుల సేకరణ నుంచి పోటులో లడ్డూ తయారీ వరకు మనుషుల ప్రమేయం లేకుండా సాంకేతికతను వాడాలని సీఎం ఆదేశించారు. లడ్డూ నాణ్యతను పరీక్షించేందుకు ఫ్రాన్స్ నుంచి రూ.3.5 కోట్లతో 'ఈ–నోస్, ఈ–టంగ్' పరికరాలు తీసుకురాబోతున్నాం. రాష్ట్రంలో ఆహార కల్తీని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నెల రోజుల్లో విశాఖపట్నంలో, మూడు నాలుగు నెలల్లో గుంటూరులో ఫుడ్ ల్యాబ్‌లు ప్రారంభించనున్నాం. రాష్ట్రంలో 11 ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నాం. ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆధ్వర్యంలో తిరుమల ల్యాబ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. ల్యాబ్‌ల నిర్వహణ, పరికరాలు, మానవ వనరుల కోసం ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూరుస్తుంది' అని మంత్రి వివరించారు.

## రాజమండ్రి కల్తీపాల ఘటన.. మరొకరు మృతి

-మొదటిపేజీ తరువాయి
వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. వైద్యులు డయాలసిస్ చేస్తూ కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ మరణంతో కలిపి మొత్తం మృతుల సంఖ్య 17కి చేరడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఇప్పటికీ ఇంకా ముగ్గురు బాధితులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, వారిలో ఇద్దరు చిన్నపిల్లలు ఉండటం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.ఫోరెన్సిక్ మరియు ల్యాబ్ రిపోర్టుల ప్రకారం, ఈ పాలలో 'ఇథిలీన్ గ్లైకాల్' (జ్ష్రఎశ్రీవఅవ +శ్రీఎఇశీశ్రీ) అనే అత్యంత విషపూరితమైన రసాయనం కలిసినట్లు అధికారులు ఇప్పటికే నిర్ధారించారు. పాలను నిల్వ చేసే ఫ్రిజర్‌లో గ్లైకాల్ లీక్ అయ్యి పాల క్యాన్లలో కలవడం వల్లే ఈ ఘోరం జరిగిందని దర్యాప్తులో తేలింది. ఈ విషపూరిత పాలు తాగిన వారిలో ఎక్కువగా వృద్ధులు మరియు చిన్నారులు ఉండటం, వారిలో అనూరియా, అక్యూట్ రీనల్ ఫెయిల్యూర్ వంటి తీవ్ర లక్షణాలు కనిపించాయి. ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తున్నప్పటికీ, చాలామంది ప్రాణాలు కాపాడలేకపోవడం ఈ రసాయనం యొక్క తీవ్రతను తెలియజేస్తోంది. ఈ ఘటనకు బాధ్యుడైన పాల వ్యాపారి అడ్డాల గణేశ్వరరావును పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనధికారికంగా 'వరలక్ష్మి డైరీ' పేరిట పాలను సేకరించి పంపిణీ చేస్తున్న ఆయనపై హత్యతో సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

## తితిదే ఆలయాలను అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

-మొదటిపేజీ తరువాయి
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోర్డు సభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ముందస్తుగానే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి శ్రీవారి దర్శనం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు.

తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమలలో ఇప్పటికే ఈ వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భవిష్యత్తులోనూ కాలుష్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి భావాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. అన్నదానం, ప్రాణదాన టస్టు సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ప్రాణదానం ట్రస్టు సేవలను విస్తరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే సేవకులకు వారి నైపుణ్యానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి, వారి సేవలను తితిదే పరిధిలోని అన్ని ఆలయాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తితిదేలో అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆలయాలకు మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

# వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పెమ్మసాని





**తెనాలి, పెన్ సత్తా, మార్చి 21:** స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో జరిగిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా శనివారం పాల్గొన్నారు. కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ ప్రతీ కార్యకర్త తమ ఓటును ఒక ఉద్యమంగా ఉపయోగించుకున్న కారణంగానే మనందరం ఇంతటి ఘనవిజయం సాధించగలిగాం అన్నారు. జగన్ మోహన రెడ్డి మన మైండ్ సెట్ మారాలని మాట్లాడుతున్నారు అని, ఎవరి మైండ్ సెట్ మారాలో ఆలోచించు కోమని జగన్ ని అడుగుతున్నాను అన్నారు. ప్రజావేదికను కూల్చడమా మైండ్ సెట్ అంటే!. అమరావతి నిర్మాణాన్ని ఆపేయడమా మైండ్ సెట్ అంటే! అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లు వేసాం, అభివృద్ధి చేశాం, నిర్మాణాలు చేపట్టాం, అమరావతి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం అన్నారు. అంతే కాకుండా అనకాపల్లిలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ వస్తుంటే, నీ హయాంలో మీ సొంత నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్ కోసం శంకుస్థాపన చేసినా మీరు, కనీసం ఇటుక కూడా వేయలేదు కదా అని, మరి దీనిని బట్టి ఎవరి మైండ్ సెట్ మారాలన్నారు. ఒక అద్భుత మైన సమన్యాయంతో ఈరోజు మన మార్కెట్ యార్డ్ కమిటీ పాలక వర్గాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కష్టపడ్డ వారికి అవకాశాలు కల్పిస్తూ ఇటు ఆలపాటి రాజా, అటు మనోహర్ కూటమి ప్రభుత్వంలో, నియోజకవర్గంలో కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నారన్నారు.

రైతుల కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కంటే రెట్టింపు బడ్జెట్ను మన కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ధరలు తగ్గిన ప్రతిసారి, రైతు ఇబ్బందుల్లో ఉన్న ప్రతిసారి కూటమి ప్రభుత్వం ఆపద్బాంధవుడిలా నిలబడుతుంది అని పెమ్మసాని అన్నారు. అనంతరం

ఆలపాటి రాజా మాట్లాడుతూ కొత్త రఘు రామయ్య నేతృత్వంలో ఈ మార్కెట్ యార్డ్ ఏర్పడింది. యార్డు నిధుల ద్వారా గ్రామ గ్రామాల్లో ఉన్న డొంక రోడ్డులకు రహదారులు నిర్మించడం అన్న ఎన్టీఆర్ చలవేనని అన్నారు. రైతును రాజు చేయాలనే మాటలతో సరిపెట్టకుండా, రైతుకు వెన్నెముకగా నిలిచినది నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడన్నారు. జోడెద్దుల లాగా కష్టపడే రైతులు - కౌలు రైతులను కంటికి రెప్పలా కూటమి ప్రభుత్వం కాపాడుతుందన్నారు. ఆ ప్రయత్నంలో భాగంగానే కూటమి ప్రభుత్వం నుండి ఈ మార్కెట్ యార్డ్ కమిటీ ఆవిర్భావం జరిగిందన్నారు. టిడిపి, జనసేన పార్టీలను పైనుంచి ఆశీర్వదిస్తూ ముందుగా నడిపిస్తున్నది బిజెపి పార్టీ అన్నారు. మనకు దక్కిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతులకు, రైతు కుటుంబాలకు ఉపయోగపడేలా పనిచేయాలని ఆశిస్తున్నాను అని రాజా అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కూటమి నాయకులు కలిసి పనిచేస్తే ఎలా ఉంటుందో అప్పుడు ఎన్నికల్లో చూపించాం, మళ్లీ ఇవాళ మన ఉత్సాహంతో నిరూపించామన్నారు.

మన రాష్ట్ర శ్రేయస్సు, సంక్షేమం కోసం మన కూటమి ప్రభుత్వం కలిసి 15 ఏళ్లు ప్రయాణించాలని పవన్ కళ్యాణ్ పిలుపు ఇవ్వడం వెనుక గల కారణాన్ని అందరూ అర్థం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వం రైతాంగం పట్ల ఎంత అరాచకంగా వ్యవహరించిందో అందరికీ తెలుసు.

రైతు కష్టపడి పండించిన ధాన్యాన్ని ఏ మిల్లులో అమ్ముకోవాలని కూడా అప్పటి వైసిపి నాయకులే నిర్ణయించేవారు.

ఒక బస్తా యూరియా కోసం రైతులు ఎన్ని కష్టాలు పడ్డారో మనందరికీ తెలుసు. వ్యవసాయం కోసం, వ్యవసాయ అభివృద్ధి కోసం మన అగ్రికల్చర్ మినిస్టర్ అచ్చం నాయుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ మనందరికీ విధితమే. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల కోసం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న సంక్షేమంలో భాగంగా మన తెనాలి మార్కెట్ యార్డ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, టిడిపి సీనియర్ మహిళా నాయకురాలు నన్నపనేని రాజకుమారి, లీడ్కాప్ చైర్మన్, గుంటూరు జిల్లా టిడిపి అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు, జడ్పీ చైర్ పర్సన్ క్రిస్టియాన, డిసిఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వర రావు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం జనసేన సమన్వయకర్త బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, ఏఎంసి మాజీ చైర్మన్ తోటకూర రమణ రావు, ఏఎంసి మాజీ చైర్మన్ వంగా సాంబి రెడ్డి, యార్డ్ కమిటీ డైరెక్టర్లు, రైతులు, టిడిపి, జనసేన, బిజెపి ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా పంపిణీ చేసిన చింతమనేని.

## ఎమ్మెల్యే ని మనసారా దీవించిన ముస్లిం కుటుంబాలు.









**దెందులూరు, పెన్ సత్తా, మార్చి 21:** దెందులూరు లో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని దాదాపు 15 వందల పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ ప్రత్యేక తోఫాను అందించి, పండగ శుభాకాంక్షలు తెలియజేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందన్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించు కొని దెందులూరు నియోజకవర్గ పరిధి లోని పేద ముస్లిం కుటుంబాలకు తాను కూడా ఆ కుటుంబాల్లో ఒక సభ్యునిగా భావిస్తూ చింతమనేని చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రతి ఏటా రంజాన్ తోఫాను అందిస్తు పండుగను మరింత ఆనందంగా జరుపుకునేందుకు దోహదపడుతున్న ఎమ్మెల్యే చింతమనేని. ఈ ఏడాది సైతం నియోజకవర్గ పరిధి లోని 4,200 మంది పేద ముస్లిం ప్రజలకు చెందిన దాదాపు 15 వందల కుటుంబాలకు రంజాన్ తోఫాను అందించారు. ప్రతి కుటుంబానికి పావు కేజీ సేమియా, పావు కేజీ, పంచదార, లీటర్ పాలతో పాటు కుటుంబం లోని సభ్యుల ఆధారంగా వారికి మటన్ ను కూడా అందించారు. ఇందు కోసం దాదాపు 1,400 కేజీల మటన్ ను ప్రత్యేకంగా కటింగ్ చేయించి ఆయా గ్రామాలకు స్థానిక కూటమి నాయకుల చేత పంపిణీ చేయించారు.

ఈ సందర్భంగా పెదపాడు మండలం లోని వట్లూరు వద్ద గల మస్జిద్లో జరిగిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని ముస్లిం సోదర, సోదరీ మణులకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రంజాన్ తోఫాను స్వయంగా ముస్లిం సోదర, సోదరీమణులకు అందించగా వారు ఎంతో ఆప్యాయంగా ఎమ్మెల్యే ని పలకరిస్తూ, ఎమ్మెల్యే కి ఖీర్ తినిపించారు. అనంతరం పెదపాడు మండలం అప్పన్న వీడు గ్రామంలో జరిగిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని పాల్గొని ముస్లింలకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా తమ పండగలో తాను కూడా భాగస్వామ్యం అవుతూ రంజాన్ తోఫాను అందిస్తున్న చింతమనేని ప్రభాకర్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కఠోర నియమాలతో ఉపవాస దీక్షలను నిర్వర్తించిన ముస్లింల దృఢ సంకల్పం, దైవ చింతన ఎంతో గొప్పదని అన్నారు. దెందులూరు నియోజకవర్గ పరిధి లోని ప్రతి కుటుంబానికి తాను ఒక పెద్ద కొడుకుగా అండగా ఉండాలని ఎల్లపూడు భావిస్తానని, ఎంతో నియోజకవర్గంలో ఏ పండగ జరిగిన, ఏ పరిణామాలు జరిగిన తాను ఆ కుటుంబంలో ఒకడిగా స్పందిస్తూ వారికి అండగా నిలుస్తూ ఉండటం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రం లోని కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అన్ని విధాల అండగా నిలుస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, ముస్లిం మత పెద్దలు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు అనిత

## అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ సమీక్షా సమావేశం.





**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 21:** నక్కపల్లి మండలం, చందనాడ రెవెన్యూ పరిధి లోని తమ్మయ్యపేట వద్ద ఈ నెల 23 న (సోమవారం) జరగనున్న ప్రతిష్టాత్మక ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ (ఏఎం/ఎన్ఎస్) ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో పాటు, కేంద్ర మంత్రులు హెచ్.డి. కుమారస్వామి, కింజరపు రామ్మోహన్ నాయుడు, భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో, హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఇతర ఉన్నతాధికారులు శనివారం క్షేత్రస్థాయిలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ నిర్వహించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగే హెలిప్యాడ్ ప్రాంతాన్ని, అక్కడి నుండి సభా ప్రాంగణం వరకు ఉన్న కాన్వాయ్ రూట్ను అధికారులు నిశితంగా పరిశీలించారు. ప్రతి శాఖకు కేటాయించిన విధులను ఎలాంటి లోటు పాట్లు లేకుండా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా హెలిప్యాడ్ వద్ద మరియు సభా ప్రాంగణంలో పటిష్టమైన బందోబస్తు ఉండాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సామాన్య ప్రజల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. జాతీయ రహదారి పై ట్రాఫిక్కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం భద్రతలో ఎలాంటి రాజీ పడకూడదని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో ఈ స్టీల్ ప్లాంట్ కీలకమని, ఇంతటి భారీ కార్యక్రమానికి విచ్చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులకు, అతిథులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భద్రతా ప్రోటోకాల్స్ను పక్కాగా అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, అడిషనల్ డైరెక్టర్ ఎస్.ఎస్.ఎస్.వి. కృష్ణారావు, ఎస్.ఓ ఆర్.పి.ఎల్.శాంతి కుమార్, అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు, ఆర్డీవో వీవీ రమణ, ఎస్.బి డీఎస్పీ జీ.ఆర్.ఆర్.మోహన్, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఇతర డీఎస్పీలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న పెమ్మసాని




**గుంటూరు, పెన్ సత్తా, మార్చి 21:** కఠిన ఉపవాస దీక్షలను భక్తి శ్రద్ధలతో పూర్తి చేసుకుని, రంజాన్ పండుగను ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకుంటున్న ముస్లిం సోదర, సోదరీ మణులందరికీ గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమసాని చంద్రశేఖర్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

గుంటూరు లోని స్థానిక ముస్లిం కళాశాలలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహమ్మద్ తో కలిసి పెమ్మసాని శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపవాసం ద్వారా సాధించే నియమం, సహనం, సేవా భావం ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. మత భేదాలు లేకుండా మనుషుల మధ్య ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు. రంజాన్ పండుగ మనలో పరస్పర గౌరవం, ప్రేమ, దాతృత్వం పెంపొందించే పండుగగా నిలుస్తుందని, ఇలాంటి పర్వదినాలు సమాజాన్ని ఏకం చేసే శక్తిగా నిలుస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం మత పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం పై అవగాహన సదస్సులో పెమ్మసాని








**గుంటూరు, పెన్ సత్తా, మార్చి 21:**రైతు నేస్తం ఫౌండేషన్ దశమ వార్షి కోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా లోని కొర్నేపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పై అవగాహన సదస్సు, తుమ్మేటి రఘోత్తం రెడ్డ రైతు నేస్తం మిద్దె తోట పురస్కారాల కార్యక్రమానికి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శనివారం ఈ కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ మట్టిని ప్రేమించే ప్రతి మనిషికి ధన్యవాదాలు తెలిపి తన ప్రశంగాన్ని ప్రారంభించారు.

మిద్దెల పై తోటలను పెంచే ఇంత పెద్ద సమూహాన్ని సమీకరించి, ఇలా అవార్డులు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. సౌత్ ఇండియా నుంచి ఎక్కువగా సాఫ్ట్వేర్ ఉద్యోగాలకు వెళ్తున్నారని, అయితే రాబోయే రోజుల్లో సాఫ్ట్వేర్ కి ఇంతటి డిమాండ్ ఉండకపోవచ్చు అన్నారు.

రాబోయే రోజుల్లో తప్పనిసరిగా వ్యవసాయానికి పూర్వ వైభవం రాబోతుందన్నారు. మన ప్రాంతాల్లో చాలామంది వ్యవసాయాలు చేస్తున్నారు కానీ, లాభాలు రావడం లేదు, వారందరూ మార్కెట్ను ముందుగా అవగాహన చేసుకుని అందరూ ఒకే పంట వేయకుండా డిమాండ్ + సప్లై ఆధారం చేసుకుని వ్యవసాయం చేయాలన్నారు.

ప్రస్తుత జనరేషన్ ను రైతులు అందిపుచ్చు కొని వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు.

మొక్కను వంచటం తేలికే గాని, అడవిని ఉంచడం అసాధ్యం అని నిరూపించాలి. ప్రభుత్వం అందిస్తున్న గోడౌన్లను ఉపయోగించు కొని రైతులు పంటకు తగిన ఆదాయం ఆర్జించాలి.

వ్యవసాయం పట్ల అప్రమత్తత, ఆధునిక సౌకర్యాలను ఉపయోగించు కోవడం వంటివి చేసినప్పుడు రైతు ఎప్పటి కైనా ఉన్నత స్థాయికి చేరుకోగలడని ఆశిస్తున్నాను. ఈ కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండర్ యడ్లపల్లి వెంకటేశ్వర రావు, ఆంధ్రప్రదేశ్ సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ డైరెక్టర్ డా. యడ్లపల్లి సతీష్, మిద్దె తోటల నిపుణులు రఘోత్తం రెడ్డి, ప్రకృతి వ్యవసాయం – ప్రాజెక్టు డైరెక్టర్ రాజకుమారి, మిద్దె తోటల అవార్డు గ్రహీతలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు పటిష్ట ఏర్పాట్లు.

- అధికారులకు పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 21:** నక్కపల్లి మండలం ఆర్సెలార్ మిట్టల్–నిప్పన్ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఈ నెల 23 న జరగనున్న భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తో సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభ నిర్వహించనున్నారు. భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కానుండడంతో భూమి పూజ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. ఇందుకోసం నాయకులు, అధికారులు, సుమారు వారం రోజుల నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. బహిరంగసభ ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, హెలీప్యాడ్, వాహనాల పార్కింగ్ పనులను శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ తో కలిసి కలెక్టర్ విజయ్ కృష్ణన్ పరిశీలించారు. అనంతరం స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన ఏర్పాట్ల పై జిల్లా అధికారులతో జాయింట్ కలెక్టర్ తో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ఈ సందర్భంగా ఆయా అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. సభకు హాజరయ్యే ప్రజలు ఎటు వంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నక్కపల్లి అడ్డురోడ్డు ఆర్డీ వో వీవీ రమణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గన్నవరం, రామవరప్పాడు లలో అత్యాధునిక పోలీస్ స్టేషన్ల నిర్మాణం.

- శాంతి భద్రతలకు కట్టుదిట్ట మైన చర్యలు విప్ యార్లగడ్డ వెంకట్రావు.



**గన్నవరం, పెన్ సత్తా, మార్చి 21:** నియోజకవర్గంలో శాంతి భద్రతల పరి రక్షణకు అత్యంత ప్రాధాన్యత నిస్తున్నామని, ప్రజల భద్రత విషయంలో ఎటువంటి రాజీ ఉండదని ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం గన్నవరం ఎయిర్ పోర్ట్‌లో గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాస్, గన్నవరం సీఐ శివ ప్రసాద్, హనుమాన్ జంక్షన్ సీఐ ఎల్. రమేష్, ఆత్కూరు ఎస్ఐ లక్ష్మీ నరసింహమూర్తితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే శాంతి భద్రతల పరిస్థితిని సమగ్రంగా సమీక్షించి, పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న గన్నవరం పోలీస్ స్టేషన్‌ను రూ.3 కోట్ల వ్యయంతో అన్ని ఆధునిక సదుపాయాలతో కూడిన జి+3 భవనంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తన హయాం లోనే ఈ నిర్మాణాన్ని పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. ఈ నిర్మాణానికి అవసర మైన నిధులను ప్రభుత్వం పై భారం లేకుండా సీఎస్సార్ నిధులు, ఎన్నారై ల సహకారంతో సమీకరించి, త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఇందుకోసం రూపొందించిన నిర్మాణ ప్రణాళికను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. విజయవాడ రూరల్ పరిధి లోని 9 గ్రామాల ప్రజల సౌకర్యార్థం రామవరప్పాడులో నూతన పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన స్థల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. ఈ పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో స్థానిక ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగి, పోలీస్ సేవలు మరింత వేగంగా, సులభంగా అందుబాటు లోకి వస్తాయని తెలిపారు. అలాగే, ఆత్కూరులో కొత్తగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను త్వరలో హోమ్ మంత్రి అనిత తో కలిసి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## ముఖ్యమంత్రి పర్యటన పై కూటమి నాయకులతో కొణటాల సమావేశం



**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 21:**రింగ్ రోడ్డు లో గల జనసేన పార్టీ కార్యాలయం నందు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నక్కపల్లి పర్యటనకు సంబంధించి నియోజకవర్గ కూటమి ముఖ్య నాయకులతో, మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అధ్యక్షతన సమావేశము నిర్వహించారు. శనివారం ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని కొణతాల కోరారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వర్మ, మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కొట్ని బాలాజీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల 15 ఏళ్ల నిరీక్షణకు తెర

రామవరప్పాడులో బీటీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే యార్లగడ్డ.





**విజయవాడ, పెన్ సత్తా, మార్చి 21:** విజయవాడ రూరల్ మండలం, రామవరప్పాడులో గత 15 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న కట్ట పై రహదారి సమస్యకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పరిష్కారం చూపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, ఈ ప్రాంతంలో బీటీ రోడ్డు పనులను స్థానిక కూటమి నాయకులతో కలిసి ప్రారంభించి, పనుల పురోగతిని పరిశీలించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు ప్రాంతాల్లో కట్టల పై నివసిస్తున్న సుమారు 20 వేల మందికి రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇంత కాలం సరైన రహదారి లేక ప్రజలు హైవేకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనేక ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పని చేసిన ప్రజా ప్రతినిధులకు ఎన్నో సార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, అయితే యార్లగడ్డ వెంకట్రావు గెలిచిన వెంటనే స్పందించి పనులు ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే వారి దీర్ఘకాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంతో పాటు ప్రాంతీయ అభివృద్ధి పై కూడా ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు. సిఎస్ఆర్ నిధులతో రామవరప్పాడులో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన మోడ్రన్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా, పేద ప్రజలకు తక్కువ ధరలో భోజనం అందించేందుకు త్వరలోనే అన్నా క్యాంటీన్ ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభివృద్ధి పనులను పర్యవేక్షించారు.

## ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి సుందరపు

**యలమంచిలి, పెన్ సత్తా, మార్చి 21:**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు ఈ నెల 23 న నక్కపల్లిలో జరగనున్న స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు కూటమి నాయకులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. శనివారం సమీక్షా సమావేశాన్ని యలమంచిలి జెడ్పీ అతిది గృహంలో నిర్వహించారు. సమీక్షలో సభ ఏర్పాట్ల పర్యవేక్షకులు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, టీడీపీ ఇన్‌చార్జ్, ఏపీఆర్డిసి చైర్మన్ ప్రగడ నాగేశ్వర రావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.




## నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి.





- భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కట్టు దిట్ట మైన భద్రత, క్యూలైన్ల నిర్వహణకు ఆదేశం.
- ఎండ వేడిమి నుండి భక్తులకు ఉపశమనం కలిగించేలా ప్రత్యేక ఏర్పాట్లు

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 21:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన అనకాపల్లి గవరపాలెం లోని నూకాంబిక అమ్మవారిని శనివారం విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఐజీ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణ కుంభంతో ఘనస్వాగతం పలికారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఐజీ ఆలయ పరిసరాలను పరిశీలించి స్థానిక పోలీస్, ఆలయ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రాబోయే 90 రోజుల పాటు భక్తుల రద్దీ విపరీతంగా ఉండే అవకాశం ఉన్నందున, క్యూ–లైన్ల వద్ద ఎటువంటి తోపులాటలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. భక్తుల రక్షణ కోసం ఆలయ పరిసరాల్లోని సిసి కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, కంట్రోల్ రూమ్ ద్వారా నిఘా పెంచాలని సూచించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా, క్యూ–లైన్లలో వేచి ఉండే భక్తులకు ఇబ్బంది కలగకుండా చల్లని తాగునీరు, మజ్జిగ సౌకర్యం కల్పించాలని, నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయానికి వచ్చే రహదారుల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ముందస్తుగా ట్రాఫిక్ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను, సహాయ కమిషనర్ యాళ్ల శ్రీధర్, ఐజీ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో అనకాపల్లి టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకట్ నారాయణ, ఎస్సై సంతోష్ కుమార్, ఆలయ ధర్మకర్తలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన ప్రముఖ వ్యాపారవేత్త ఎం.వి.ఆర్.





**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 21:** జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వర రావు (ఎం.వి.ఆర్) విశాఖ బీజేపీ పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ వెంకటేశ్వర రావు కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎం.వి.ఆర్ తో పాటు సుమారు 100 మంది పైగా అనుచరులు, స్థానిక సర్పంచులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ విధానాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం పట్ల ఆకర్షితులై ప్రజల సేవలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో బీజేపీలో చేరినట్లు ఎం.వి.ఆర్ తెలిపారు. ఈ సందర్భంగా పి.వి.ఎన్. మాధవ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అనకాపల్లి ప్రాంతంలో పార్టీని అన్ని స్థాయిల్లో బలోపేతం చేయాలని నాయకులకు సూచించారు.

కులమతాలకు అతీతంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ, రానున్న రోజుల్లో బీజేపీని అధికారం లోకి తీసుకురావడమే లక్ష్యమని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

# అడవులు పరి రక్షణ మానవాళి బాధ్యత





- చిట్టడవులతో కర్బన వాయువులను తగ్గించుదాం.
- నగరవనాల్లో పక్షులు గూళ్ళు పెట్టే చెట్లు పెంచాలి.
- భూమికి పూర్వపు శోభను తీసుకు వద్దాం.
- ఆకుల చలపతిరావు, రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ నర్సరీల అసోషియేషన్.

**పెందుర్తి, పెన్ సత్తా, మార్చి 21:**అడవులు పరి రక్షణ మానవాళి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ నర్సరీల అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల చలపతిరావు పిలుపు నిచ్చారు. శనివారం ఉదయం విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం పెద్ద గాడి గ్రామం లోని సంకల్ప కళా గ్రామంలో ప్రపంచ అడవులు పరి రక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని సంకల్ప కళా గ్రామం, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ లు సంయుక్తంగా నిర్వహించాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఇతివృత్తం అడవులూ, ఆర్థిక వ్యవస్థలు అన్నారు. అడవులు ఆర్థిక అభివృద్ధి, జీవనోపాధి, ఉపాధి అవకాశాల్లో కీలక పాత్ర పోషిస్తాయని తెలియజేశారు. అలాగే పర్యావరణ సమతుల్యతతో పాటు ఆర్థిక వృద్ధి కోసం సుస్థిర అటవీ నిర్వహణ అవసరాన్ని ప్రోత్సహిస్తుందని వివరించారు. చిట్టడవులతో కర్బన వాయువులను తగ్గించుదాం అన్నారు. నగరవనాల్లో పక్షులు గూళ్ళు పెట్టే చెట్లు పెంచాలని , ఔషధ గుణాలు కలిగిన చెట్లు, కాలుష్యాన్ని నిర్మూలించే చెట్లు పెంచాలని కోరారు. భూమికి పూర్వపు శోభను తీసుకు వచ్చెందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మేంగొ మేన్ అప్పాజీ మాట్లాడుతూ మన వృక్షాలను మనమే కాపాడుకోవాలి అని కోరారు. అడవులు మన ఆరోగ్యానికి,ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తాయి అన్నారు. అడవులు గ్రామీణ జీవనోపాధులకు ప్రధాన మైన మద్దతు ఇస్తాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 1.6 బిలియన్ మంది ప్రజలు అడవుల పై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ మాట్లాడుతూ అడవులను ఆర్థిక లాభం కోసం మాత్రమే కాకుండా జీవవైవిధ్య పరి రక్షణతో ప్రధాన మైనవిగా గుర్తించాలన్నారు. మనం భూగోళం సమస్త జీవరాశి ఆవాశం అన్నారు. అందులో మనిషి ఒక భాగం మాత్రమే అనె ముఖ్యాంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తులసి నేచురల్స్ ప్రతినిధి టి సత్యన్నారాయణ , సంకల్ప కళా గ్రామం ప్రతినిధులు పార్వతి, జమిల్యా, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, సమన్వయకర్త జె రాజేశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు.

# సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా సమీక్షలో దాడి

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 21**: గవరపాలెం పెదరామ స్వామి దేవస్థానంలో తేదీ 27 తేదీ శుక్రవారం జరగబోవు సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆలయ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామనవమి వేడుకలు మార్చి 25 వ తేదీ నుండి 29 వ తేదీ వరకు అతి వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మార్చి 25 వ తేదీ బుధవారం స్వామివారి కళ్యాణరాట నిర్వహించబడుతుందని తెలియజేశారు. మార్చి 27 వ తేదీ శుక్రవారం ఉదయం 4 గంటల నుండి 6 గంటల వరకు స్వామివారికి పంచామృతాలతో అర్చన, అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించ బడతాయని తెలియజేశారు. అనంతరం ఉదయం పది గంటల నుండి శ్రీరామచంద్ర మూర్తి, సీతామహాలక్ష్మి అమ్మవార్లకు కళ్యాణ మహోత్సవం అతి వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించ బడుతుందని తెలియజేశారు. కళ్యాణ మహోత్సవం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి సుమారు పదివేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించ బడుతుందని తెలిపారు. మార్చి 29 వ తేదీ ఆదివారం సాయంత్రం ఏడు గంటల నుండి స్వామివారి ఊంజల సేవా కార్యక్రమం, కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించ బడుతుందని తెలియజేశారు. కావున భక్తులందరూ, పురప్రజలు శ్రీరామనవమి వేడుకలలో పాలుపంచుకుని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి కృపా కటాక్ష వీక్షణాలు పొందవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మళ్ల రాజా, బొడ్డేడ శంకర్రావు, కర్రి శివన్నారాయణ, కొణతాల అప్పలనాయుడు, కొణతాల గోపికృష్ణ, కర్రి అప్పాజీ, మళ్ల శ్రీను, కోరుబిల్లి ఆరుద్ర, కోరుభిల్లి పర్రి, పథకంశెట్టి శ్రీను, పెంటకోట చిన్న, పెంటకోట శివాజీ, కర్రి భాను,అధిక సంఖ్యలో యువత తదితరులు పాల్గొన్నారు.





# బడ్జెట్లో కార్మిక రంగానికి తీవ్ర అన్యాయం......!

- ఏజే రమేష్ సిఐటియు జిల్లా కార్యదర్శి.
- సిఐటియు ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రుల దగ్ధం.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పెన్ సత్తా, మార్చి 21:**రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కార్మిక రంగానికి మొండి చేసిపించి తీవ్ర అన్యాయానికి పూనుకున్నారని అధ్యక్ష భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ఆరోపించారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక రంగానికి బడ్జెట్లో జరిగిన అన్యాయంపై నిరసిస్తూ బడ్జెట్ పత్రాలను తగలబెట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మచారి అధ్యక్షతన జరిగిన సభలో ఏ జే రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కింగ్ వర్కర్లకు వేతనాలు పెంచే విధంగా బడ్జెట్లో నిధులు కేటాయించలేదని అన్నారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా అంగన్వాడి ఆశ మధ్యాహ్న భోజన సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు పదివేల నుండి 26వేల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి అధికారం చేపట్టాక హామీని తుంగలతోక్కారని అన్నారు. కార్మిక సంక్షేమానికి కేవలం 900 కోట్లు మాత్రమే కేటాయించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. కేవలం కార్పొరేటర్ అభివృద్ధి కోసమే బట్టి విక్రమార్క బడ్జెట్ ని రూపొందించారని స్పష్టమవుతుందని అన్నారు. కార్మికులు స్కీం వర్కర్లనే కాకుండా ఈ ప్రభుత్వం రోజువారి కూలీలను ఆటోడ్రైవర్లను సైతం తీవ్రంగా మోసం చేస్తుందని అన్నారు. ఓ పక్క గ్రామీణ పేదల ఉపాధి కోల్పోయే విధంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని సవరిస్తే పట్టణ ప్రాంతాలలో కార్మికుల పొట్ట కొట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విధానాలను అవలంబిస్తుందని అన్నారు. ఆటో కార్మికులకు 12 వేల వేతనాలను చెల్లిస్తానన్న రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఆ పథకానికి కనీసం విధివిధానాలు కూడా ప్రకటించలేదని ఎద్దేవా చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం లేబర్ కోళ్లతో కార్మికుల హక్కులను కాల రాస్తుంటే రాష్ట్ర ప్రభుత్వాల సైతం మోడీ బాటలోని పయనిస్తూ కార్మికుల నడ్డి విడిచే విధంగా బడ్జెట్లో అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బడ్జెట్లో కార్మిక రంగానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ నిరసన కార్యక్రమాలను చేపట్టిందని ఏజే రమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎంబీ నర్సారెడ్డి బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ రాష్ట్ర నాయకులు వంగూరి రాములు రామ్మోహన్ సిఐటియు జిల్లా నాయకులు ఎర్రం శెట్టి వెంకట రామారావు. ఎలక సోమన్న ఉప్పలయ్య రాము శ్రీను జాకీర్ ప్రసాద్ చంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు...

# శాంతి, నిష్టతో కూడిన జీవితమే ఉత్తమమైనది

- జవహర్ నగర్ జీహెచ్ఎంసి పరిధిలో గల పలు ఈద్గాలలో ప్రశాంతంగా జరిగిన రంజాన్ ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలియజేసిన ముస్లిం అధ్యక్షులు మహ్మద్ పాషామియా, టి.కాలేషా

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పెన్ సత్తా, మార్చి 21::**ఎవరైతే ఖురాన్ ఆదేశాలను అనుసరించి,నియమ, నిభంధనలతో జీవితాన్ని అనుసరిస్తారో? వారు శాంతి, నిష్టతో కూడిన ఉత్తమమైన జీవితంతో పాటు అల్లాహుతా అల్లా సొల్లాలాహు అలైహ్ కు అత్యంత ప్రీతి పాత్రులు అగుదురని గుర్తుచేస్తూ జవహర్ నగర్ జీహెచ్ఎంసి పరిధిలో గల పలు ఈద్గాలలో ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. మార్చ్-21, 2026, శనివారం రోజున కాప్రా, మేడ్చల్ లోని జవహర్ నగర్, వికలాంగుల కాలనీ గల నయా ఈద్గాలో సైయద్, ముబషీర్(అబ్బు), ఎం.డి.మోయినుద్దీన్, వెంకటేశ్వర కాలనీ పాత ఈద్గాలో ఎస్.కె.అహ్మద్, అంబేద్కర్ నగర్ ఈద్గాలో ఎం.డి.ఒమర్ షరీఫ్, మల్కారం ఈద్గాలో మహ్మద్ షాబుద్దీన్(అబ్బు), ఫరానగర్ ఈద్గాలో ఎం.డి. కరమ్ ఖాన్, అరుంధతీ నగర్ ఈద్గాలో ఎస్.కె.సుల్తాన్స్, వై.ఎస్.ఆర్. డంపింగ్ యార్డ్ ఈద్గాలో ఎం.డి. జావేద్ ఆధ్వర్యంలో రంజాన్ ప్రార్థనలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ పాషామియా, టి.కాలేష , జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్, మాజీ సర్పంచ్ కారింగుల జ్యోతి శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు మట్ల. వినయ్ కుమార్, ఎన్. ఎస్. వి. ఐ. సాయికుమార్, జవహర్ నగర్ లోని అన్నివర్గాల ప్రజాలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచ నలుమూలలలో మానవ మనుగడను దెబ్బతీస్తున్న యుద్దాల మధ్య బరించలేని ఆవేధనతో ప్రార్థనలు చేసుకోవడం జరిగిందని అన్నారు. ప్రేమ పూర్వకమైన మానవత్వంతో యుద్ధాలు ఆగి, ప్రపంచ శాంతికి దోహద పడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పటిష్టమైన భద్రతను కల్పించిన సిఐ. సైదులు, ఎస్సై. రామ్ నాయక్ ప్రార్థనలు సజావుగా జరగడానికి సహకరించిన పోలీసు అధికారులకు, పోలీసులకు మరియు ప్రభుత్వ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి ఎక్సి క్యూటివ్ మెంబర్ గా యం.డి ఖుర్షిద్ ఎన్నిక.



**పెన్ సత్తా, మార్చి 21**:మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు 3 వ వార్డు మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు యం.డి ఖుర్షిద్ ను గురువారం నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి పాలకవర్గం లో ఎక్సి క్యూటివ్ మెంబర్ గా నియమించారు ఈ సందర్భంగా ఖుర్షిద్ మాట్లాడుతూ నా నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు పార్టీ కోసం ఎల్లవేళలా ముందుండి పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తానని తెలిపారు

## సమైక్యతా సౌరభం.. రంజాన్ సంబరం!

- ముస్లిం సోదరులతో తుంబూరు దయాకర్ రెడ్డి ఆత్మీయ ఆలింగనరొ



**పెన్ సత్తా, మార్చి 21**: భారతీయ జీవన స్రవంతిలో అంతర్భాగమైన గంగా-జమునా తెహజీబ్‌కు నిలువుటద్దంగా, మత సామరస్యానికి మకుటాయమానంగా రంజాన్ పర్వదిన వేడుకలు శనివారం జిల్లా కేంద్రంతో పాటు ఏదులాపురం ప్రాంతంలో మిన్నంటాయి. ఈ సందర్భంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

సంక్షేమ పథకాలపై భరోసా

ఏదులాపురం మున్సిపాలిటీ మద్దులపల్లిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. “ఇందిరమ్మ ప్రభుత్వం మైనారిటీల పక్షపాతి. విద్యా, ఉపాధి రంగాల్లో ముస్లిం సోదరులకు అండగా ఉంటూ, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే మంత్రి పొంగులేటి లక్ష్యం“ అని భరోసా ఇచ్చారు.

ఆత్మీయ ఆతిథ్యం

పండుగ వేళ ఆత్మీయతను చాటుతూ మద్దులపల్లిలోని ఎస్.కె. జానీ నివాసానికి, ఖమ్మం నగరంలోని సీనియర్ నాయకులు ఎస్.కె. ఇమామ్ భాయ్ గృహానికి వెళ్లిన దయాకర్ రెడ్డి, వారి ఆతిథ్యాన్ని స్వీకరించి ఈద్ ముబారక్ తెలియజేశారు. ఈ వేడుకల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్ గొడ్డుగొర్ల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన జగన్నాధపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు



**పెన్ సత్తా, మార్చి 21**:రంజాన్ పండగ సందర్భంగా జగన్నాధపురం గ్రామ మైనార్టీ శాఖ అధ్యక్షులు ఎస్ కే సైదా గృహానికి వెళ్లి కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు కాంగ్రెస్ నాయకులను సాదరంగా ఆహ్వానించి రంజాన్ పాయసాన్ని కాంగ్రెస్ నాయకులకు అందజేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులుమాట్లాడుతూ.. అత్యంత పవిత్రమైన రంజాన్ నెలలో ఉపవాస దీక్షలు చెయ్యడం, పేదలకు దానం చేయటం, మతసామరస్యానికి ప్రతీక అయిన రంజాన్ పండుగ ఆనందోత్సాహాలతో జరుపుకోవటం సంతోషంగా ఉందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో... మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున,గ్రామ సర్పంచ్ తాళ్ళూరి స్వప్న- రమేష్, మొదటి వార్డు సభ్యులు తోటకూరి హరీష్, కాంగ్రెస్ నాయకులు తోటకూరి సైదేశ్వరరావు,తోటకూరి నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మధిర నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అనిల్ కుమార్ వెర్పుల,జగన్నాధపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అరువురివెంకటేశ్వర్లు,బండారుపల్లి రంగారావు,మైనార్టీ నాయకులు ఎస్ కే హసేన్ ,జానీ,కుటుంబ సభ్యులు. తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించిన ముస్లిం సోదరులు.



**పెన్ సత్తా, మార్చి 21::**మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని రంజాన్ పర్వదినం సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సహోదరులు పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నెల రోజులు కఠిన ఉపవాస దినములు చేసి 31 వ రోజు దీక్ష విరమించి, పవిత్రమైన రంజాన్ ని పురస్కరించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలోముస్లిం మత పెద్దలు, సహోదరులు తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిష్యం:ఇంపార్టెంట్ వర్క్..ఏ రోజు బయటకు వెళ్లాలి.. ఇవి ఎదురు వచ్చాయా..మీకు తిరుగుండదు.!




చాలా మంది ఎప్పుడు ఏ పనిపై ఎక్కడకు వెళ్లినా కలిసిరాదు.. కొంతమందికి వెళ్లడంతోనే వెళ్లిన పని చాలా సులువుగా అవుతుంది. కొంతమందికి అనేక అడ్డంకులు ఏర్పడుతాయి.. బయటకు వెళ్లేటప్పుడు ముహూర్తం అవసరమా.. ఏ రోజు ఏ దిక్కున వెళితే తల పెట్టిన పని పూర్తవుతుంది. ఎప్పుడు ప్రయాణిస్తే మనకు శుభం జరుగుతుంది. రాహుకాలం.. యమగండంలో వర్జ్యం.. దుర్మూహూర్తంలో పని ప్రారంభిస్తే ఏమవుతుంది.. పండితులు ఏమంటున్నారు...మొదలగు విషయాలనుఈ స్టోరీలో తెలుసుకుందాం. . .!

పండితులు తెలిపిన వివరాల ప్రకారం .. శుక్లపక్షములో విదియ, తదియ, పంచమి, సప్తమి, దశమి తిథులు. అశ్వని, మృగశిర, పునర్వసు, పుష్యమి, హస్త, అనూరాధ, మూల, శ్రవణం, ధనిష్ఠ, రేవతి నక్షత్రములు మంచివి. బహుళ పక్షములో కూడా ప్రయాణం చేయుటకు ఈ ప్రకారం పాటించవలయును. రాహుకాలం, గుళిక కాలం, యమగండ కాలం, వర్జ్యం విషయములో కూడా మంచిది కాదని పండితులు చెబుతున్నారు.పెద్దలు అనుభవంతో వ్రాసిన దుర్మహూర్త కాలమును ప్రతిరోజు ఆచరించాలి. ప్రతిరోజు అమృతగడియలలో ప్రయాణం చేయవచ్చును. బయటకు వెళ్ళవచ్చును. తూర్పు ప్రయాణం చేయవలయును అనుకుంటే వారము, లగ్నం పాటించాలి. మీరు తీర్థయాత్రలు చేయవలెను అనుకుంటే ముహూర్తబలంతో వెళితే ప్రయాణంలో ఎలాంటి ప్రమాదములు జరగకుండా క్షేమంగా తిరిగి వస్తారు. ఈ విధంగా ఎనిమిది దిక్కులకు ప్రయాణం చేయాలి అంటే ఆలోచన చేసి వెళ్ళట మంచిదని జ్యోతిష్య నిపుణులు అంటున్నారు.

నవమి ఆదివారం పడమర దిక్కు వెళ్ళటం మంచిది కాదు. ఏకాదశి సోమవారం, పంచమి మంగళవారం, తదియ బుధవారం, షష్ఠి గురువారం, అష్టమి శుక్రవారం, ద్వాదశి శనివారం ఉన్న రోజులలో ప్రయాణం చేయరాదు. అనేక విధములుగా కష్టనష్టములు కలుగుటకు అవకాశములుండును. చెడు రోజులు ఎవరికి వారు తెలుసుకొని ఆచరించండి. ఆనందంగా ప్రయాణం చేయండి, క్షేమంగా తిరిగిరండి.

**ప్రయాణమునకు మంచి శకునములు**

ముత్తైదువ స్త్రీ, వేశ్య, కన్య, పెండ్లి ఊరేగింపు, ఇద్దరు బ్రాహ్మణులు, మంగళమగు ఊరేగింపు, పండ్లు, పువ్వులు, ఛత్రము, చామరము, గుఱ్ఱము, ఏనుగు, పూర్ణకుంభము, చెరుకు, పాలు, పెరుగు, క్యారేజి, ఆవు, కల్లుకుండ, తేనె, వస్త్రవ్యాపారి, తెల్లని వస్తువులు, చల్లనిగాలి, వృషభము మొదలగునవి మనకు ఎదురు వచ్చిన చాలా మంచిదని పండితులు చెబుతున్నారు.

# వాస్తుశాస్త్రం : కృత యుగం నుంచి కీలక పాత్ర .. అందరూ కచ్చితంగా పాటించాల్సిందే.. లేకపోతే కష్టాలే..!




మానవ జీవితంలో వాస్తుశాస్త్రం ఆచరణీయమైన పరిజ్ఞానంగా కలిసిపోయింది. కృతయుగం నుండి కలియుగం వరకు అన్ని యుగాలలోనూ ఈ శాస్త్రం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో కొంతమంది మాత్రమే ఈ వాస్తుశాస్త్రం ప్రయోజనాలను పొందారు. ఇప్పుడు అందరికీ అందుబాటులో వాస్తుశాస్త్రం ఉపయోగపడుతుంది. వాస్తను కచ్చితంగా అందరూ పాటించాల్సిందే.. లేకపోతే ఇబ్బందులు వస్తాయని పండితులు చెబుతున్నారు..వాస్తుశాస్త్రం యొక్క ప్రధానమైన ఉద్దేశ్యం సౌకర్యవంతమైన, ఆరోగ్యకరమైన జీవనం కొరకు గృహం నిర్మించుకోవడానికి ఈ శాస్త్రం ఉద్దేశింపబడినది. తూర్పుదిక్కున వాస్తు శాస్త్రం ప్రకారం అన్ని రకాలుగా బాగున్నది. వాస్తు దోషం లేని ఇల్లు కట్టుకుంటే అది కొందరికి మాత్రమే కలిసివస్తుంది.

ఉత్తర ముఖంగా ఇల్లు కట్టుకుంటే వాస్తుప్రకారం ఏ రకమైనటువంటి లోపం లేకున్నా కొంతమందికి కలిసి వస్తుంది, కొంతమందికి కలిసిరాదు. దక్షిణ ముఖంగా ఇల్లు కట్టుకుంటే కొంతమంది ఇబ్బంది పడతారు, మరికొంతమంది విశేషమైన అసైశ్వర్యాలను, అధికారాన్ని, అత్యున్నతమైన విద్యను పేరు ప్రతిష్ఠలను సంపాదించుకోగలుగుతారు. అదేవిధంగా పదమటదిక్కున వాస్తుదోషం లేకుండా ఇల్లు కట్టుకుంటే కొంతమందికి బాగా కలిసివస్తుంది. కొంతమంది సర్వం కోల్పోతారు. వాస్తు బాగా ఉన్నటువంటి పరిస్థితిలో కొంత మందికి కలిసిరావడం, కలిసిరాక పోవడానికి కారణం ఏమిటి? వాస్తుప్రకారం కట్టినటువంటి ఇల్లు ఏ దిక్కున ఉన్నా యజమాని జాతకానికి అది సరిపోవాలి. అప్పుడు వాస్తు శాస్త్రం యొక్క ముఖ్యమైన ఉద్దేశ్యం కార్యరూపం దాలుస్తుంది. ప్రధానంగా ఏ దిక్కున ఇల్లు కట్టుకున్నా, ఏ రకమైనటువంటి శాస్త్రం వీధిపోటు ఉన్నా, ఏ దిక్కులోనైనా హెచ్చుతగ్గులు ఉంటే వాస్తుశాస్త్ర సంబంధ మైనటువంటి దుష్ఫలితాలు వర్తించవు. ప్రధానంగా జాతకం బాగుండాలి. ఆ జాతకానికి ఆ ఇంటి వాస్తుకి, దిక్కుకి సరిపోతే అదృష్ట వంతమైన రోజులు, అనుకూలమైన రోజులు సంప్రాప్తిస్తాయి. అన్నివిధాలుగా అభివృద్ధి సాధించగలుగుతారు. ఏది ఏమైనా ప్రధానమైన విషయం ఏమిటంటే జాతకానికి, వాస్తుకి పొంతన సరిపోవాలి, గ్రహగతులు, వాస్తు స్థితిగతులు ఒకే నాణానికి ఇరువైపుల వంటివి. వీటిని పరిగణలోకి తీసుకోకుండా చేసే పనులు అంతగా కలిసిరావు. పడమర నైఋతి వీధిపోటు తప్ప మిగిలిన అన్నిరకాల వీధిపోట్లు కలిసివస్తాయి.

ఈశాన్యంలో ఈశ్వరుడు ఉంటాడని, ఈశాన్య దిక్కుకి ఈశ్వరుడు అధిపతి అని కొంతమంది చెబుతుంటారు. దిక్పాలకుల్లో ఒక్కడైనటువంటి ఈశాన్యుడు వేరు, పరమేశ్వరుడు వేరు. పరమేశ్వరుడు సమస్త లోకాలు అధిపతి. ఆయన సంకల్పంతోనే సమస్త లోకాలకు సంచరిస్తుంటాయి. మహాదేవుణ్ణి ఈశాన్య దిక్కుకి పరిమితం చేయడం ధర్మశాస్త్రరీత్యా ఆ క్షేపణీయమైనది. ఏదిఏమైనా మీ జాతకం ప్రకారం, లగ్నం ప్రకారం, మీకు నడుస్తున్న దశ ప్రకారం వాస్తుశాస్త్రం మీకు ఉపయోగపడుతుంది..

# రంజాన్ రోజున తగ్గిన బంగారం, వెండి.. తెలుగు రాష్ట్రాల్లో కొత్త రేట్లు ఇవే..

అమెరికా డాలర్ విలువ పెరగడం, ముడిచమురు ధరలు భారీగా పెరిగిపోవడంతో మళ్లీ ధరలు పెరుగుతాయన్న ఆందోళన మొదలైంది. దింతో గత వారం ప్రపంచ మార్కెట్‌లో బంగారం అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి. ఫలితంగా బంగారం ధరలు బాగా తగ్గుముఖం పట్టాయి.

అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం మొదలైన సమయంలో వీజశ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ. 1,60,000 వరకు వెళ్లింది. గత వారం భారీగా పడిపోయిన బంగారం ధర, చివరకు 10 గ్రాములకు రూ. 1,44,825 వద్ద నిలిచింది. బంగారం ధరలు తగ్గడం వల్ల కొనుగోలుదారులకు ఇది కొంత ఊరట కలిగించే విషయమనే చెప్పాలి.

ఈ రోజు (మార్చ్ 21) 24క్యారెట్ల బంగారం 1గ్రాము ధర కాస్త తగ్గి రూ. 14,890 ఉండగా, 22క్యారెట్ల బంగారం ధర రూ. 13,654, 18క్యారెట్ల బంగారం ధర రూ. 11,172. దింతో 10 గ్రాముల 24క్యారెట్ల ధర రూ. 10 తగ్గి రూ. 1,48,900, 22క్యారెట్ల ధర రూ. 1,36,540, 18క్యారెట్ల ధర రూ. 1,11,720.

హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మంలో 10 గ్రాముల 24క్యారెట్ల బంగారం ధర




రూ. 1,48,900, 22క్యారెట్ల ధర రూ. 1,36,540, 18క్యారెట్ల ధర రూ. 1,11,720

విజయవాడ, విశాఖపట్నం, అమరావతి, గుంటూరు, నెల్లూరు, కాకినాడ, తిరుపతి, కడప, అనంతపురంలో 10 గ్రాముల 24క్యారెట్ల బంగారం ధర రూ. 1,48,900, 22క్యారెట్ల ధర రూ. 1,36,540, 18 క్యారెట్ల ధర రూ. 1,11,720 ఇక వెండి గ్రాము ధర రూ. 254.90 ఉండగా.. కిలోకి రూ. 100 తగ్గి రూ. 2,54,900 చేరింది. తెలుగు రాష్ట్రాల్లో కేజీ వెండి ధర చూస్తే రూ. 2,59,900 వద్ద ఉంది.


**బంగారం, చమురు ధరలపై ప్రభావం**

అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, పశ్చిమ ఆసియాలో జరుగుతున్న దాడుల ప్రభావం రోజురోజుకి వేడెక్కుతున్నాయి. ఇరాన్‌లోని 'సౌత్ పార్స్' గ్యాస్ నిలయాలపై ఇజ్రాయెల్ దాడులు చేయడం, దానికి ప్రతికారంగా ఇరాన్ కూడా ఇతర గల్ఫ్ దేశాల్లోని చమురు కేంద్రాలపై దాడులు చేసే అవకాశం ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు మొదలయ్యాయి.

ఈ గొడవల వల్ల పెట్రోల్, డీజిల్ (ముడిచమురు) సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయంతో వాటి ధరలు

భారీగా పెరుగుతున్నాయి. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు కూడా పెరుగుతాయి. దీనివల్ల విదేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు పెరిగి, సామాన్యుడిపై భారం పడే ప్రమాదం ఉంది.

## జూన్ నెల కోటా దర్శన టికెట్లు రిలీజ్



తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ గుడ్ న్యూస్ చెప్పింది. జూన్ నెల దర్శన టికెట్లు, గదుల వివరాలను టీటీడీ వెల్లడించింది. తిరుమల శ్రీవారి ఆర్జిత , సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవకు సంబంధించిన జూన్ నెల కోటాను మార్చి 20 న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేసింది.

**ఏ టికెట్లు ఎపుడంటే..?**

వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను (21న) మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది

అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.

అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను మార్చి 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.

శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.

వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

## వీళ్లకు మానవత్వం ఉండదా? సమోసాల తయారీ ఇంత దారుణమా?



సమయం ఏదైనా సమోసా కనిపించినంతనే తినేద్దామన్న ఫీలింగ్ కలిగించటంలో దీని లెక్కే వేరుగా ఉంటుంది. అందునా హైదరాబాద్ మహానగరంలో గల్లీకో సమోసా షాప్ ఉండటం తెలిసిందే. కల్తీ దుర్మార్గం సమోసా లాంటి స్నాక్స్ విషయంలోనూ ఉండటం షాకింగ్ గా మారింది. ఇప్పటివరకు కల్తీ పాలు.. పన్నీర్.. అల్లంవెల్లుల్లి పేస్ట్.. మోతీచూర్ లడ్డూ.. ఇలా ప్రతి దానిని కల్తీగా మార్చేసి దుర్మార్గం.. ఇప్పుడు సమోసాకు మినహాయింపు కాదన్న విషయం తేలింది. ఒక మసోసా తయారీ కేంద్రంపై కుల్సుంపురా పోలీసులు దాడి చేయగా.. షాకింగ్ వాస్తవాలు వెలుగు చూశాయిఇక్కడి సమోసా తయారీ ఎంత అరాచకంగా ఉంటుందన్నది చూసిన తర్వాత సమోసాను తినాలనే ఆలోచనే చచ్చిపోయేలా ఉండటం గమనార్హం. ఈ సమోసా తయారీ కేంద్రంలో కుళ్లిన గుడ్లు..కల్తీ నూనె.. పిండి.. ఇది అది అన్న తేడా లేకుండా అన్ని కల్తీ ముడిపదార్థాలతో తయారు చేసే తీరు చూస్తే నోట మాట రాదంతే. గోల్కొండకు చెందిన 73 ఏళ్ల అబ్దుల్ రషీద్ జియాగూడ బైపాస్ రోడ్డులో మూసీ తీరంలో సమోసా తయారీని ఒక షెడ్డులో నిర్వహిస్తుంటాడు. వాటిని పరిసర ప్రాంతాల్లోని హోటళ్లు.. బేకరీలు.. చిరు వ్యాపారులకు అమ్ముతుంటాడు.

యజమాని రషీద్ తో పాటు మరో ఐదారుగురు పని చేస్తుంటారు. ఇక్కడ తయారు చేసే సమోసాలకు మంచి ఆదరణ ఉందని చెబుతున్నా.. ఇక్కడ ఫుడ్ సేఫ్టీకి సంబంధించి ఎలాంటి నిబంధనలు పాటించని తీరు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. అంతేకాదు.. ఈ తయారీ కేంద్రానికి ప్రభుత్వ అనుమతులు కూడా లేకపోవటం గమనార్హం. పూర్తిగా నేలపై అపరిశుభ్ర వాతావరణంలో కుళ్లిన కోడిగుడ్లు..కాలం చెల్లిన కల్తీ మైదా.. కల్తీ వంట నూనెలతో పాటు కుళ్లిన కూరగాయాల్ని వినియోగిస్తూ తయారు చేసే సమోసా.. ఎంతటి అనారోగ్యానికి గురి చేస్తుందో ఆలోచించేందుకు సైతం భయం వేస్తుంది. ఈ ఉదంతం గురించి తెలిసిన తర్వాత సమోసాను అంత తేలిగ్గా తినే సాహసం చేయరని చెప్పకతప్పదు.

## కోట్లాది ఐఫోన్ యూజర్లకు 'డార్క్‌స్వోర్డ్' ముప్పు

ఐఫోన్ అంటే అత్యంత భద్రమైన ఫోన్ అనే నమ్మకానికి గట్టి దెబ్బ తగిలింది. 'డార్క్‌స్వోర్డ్' అనే అత్యంత ప్రమాదకరమైన స్పైవేర్ ఇప్పుడు ఐఫోన్ వినియోగదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కోట్లాది ఐఫోన్లను ఇది క్షణాల్లో హ్యాక్ చేయగలదని గూగుల్ సహా పలు సైబర్ భద్రతా సంస్థల పరిశోధనలో వెల్లడైంది.సాధారణంగా ఏదైనా లింక్‌పై క్లిక్ చేస్తే మాల్‌వేర్ వస్తుందని భావిస్తాం. కానీ ఈ స్పైవేర్ మరింత తెలివిగా పనిచేస్తోంది. ప్రభుత్వ లేదా ఇతర నమ్మకమైన వెబ్‌సైట్లను సందర్శించినప్పుడు, వాటిలో హ్యాకర్లు ముందుగా చొప్పించిన కోడ్ ద్వారా ఇది నేరుగా ఫోన్‌లోకి ప్రవేశిస్తుంది. ఒక్కసారి ఫోన్‌లోకి చేరితే ఫొటోలు, వ్యక్తిగత మెసేజ్‌లు, చివరికి క్రిప్టోకరెన్సీ వాలెట్లను సైతం ఖాళీ చేసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సౌదీ అరేబియా, ఉక్రెయిన్ వంటి దేశాల్లోని ప్రముఖుల డేటా చోరీకి దీనిని ఉపయోగించినట్లు గుర్తించారు.ముఖ్యంగా పాత ఆపరేటింగ్ సిస్టమ్‌లు వాడుతున్న ఐఫోన్లకు ఈ 'డార్క్‌స్వోర్డ్' స్పైవేర్ నుంచి ముప్పు ఎక్కువగా ఉంది. ఐఓఎస్ 18, అంతకంటే పాత వెర్షన్లపై ఇది సులభంగా దాడి చేయగలదని తేలింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐఫోన్లలో దాదాపు 25 శాతం ఫోన్లు ఇప్పటికీ పాత సాఫ్ట్‌వేర్‌తోనే నడుస్తున్నాయని, వారందరూ హ్యాకర్ల బారిన పడే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయి.

## ఎడిటోరియల్

### నీటి పరిరక్షణ సామాజిక బాధ్యత

నీరు ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు ప్రాణాధారము. ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపరూపమైన పదార్థము. మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో నీరూ అంతే అవసరం. నీరే లేకపోతే పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహాసముద్రాలు ఏమీ ఉండవు. ఇవేమీ లేకుండా ఎండిపోయిన మట్టి గడ్డలా ఉంటుంది భూమి. భూమిమీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. అంతటి అమూల్యమైన నీటి విలువను తెలుసు కోడానికి, దానిని వృథా చేయకుండా అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి 1993 నుంచి ప్రతి సంవత్సరం మార్చి 22న అంతర్జాతీయ జల దినోత్సవంగా గుర్తించాలని నిర్ణయించింది. ఐక్య రాజ్య సమితి, ప్రపంచ జల దినోత్సవాన్ని 1992 యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, రియో డి జెనీరియో సమావేశంలో ప్రతిపాదించింది. దీన్ని 1993వ సంవత్సరం నుంచి నిర్వహించడం ప్రారంభించారు.

మెరుగైన మంచి నీటి వనరుల నిర్వహణ, ప్రాముఖ్యత పట్ల అవగాహనా కల్పించడం కోసం ఐక్య రాజ్య తెలంగాణ ప్రతి సంవత్సరం మార్చి 22ను ప్రపంచ జల దినోత్సవంగా జరుపుతుంది. భారత్‌లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి. మన చరిత్రంతా జలవనరుల తోనే ముడిపడి ఉంది. నీటిని పరిరక్షించు కోవాలనే నినాదాన్ని ప్రాచీన నాగరికతలు వెల్లడించాయి. భారతీయులకు నీటి విలువ తెలుసు కనుకే నదులను పూజించే ఆచారం ఉంది. నీటిని పూజించి, నదులకు, చెరువులకు, జలాశయాలకు హారతులిస్తారు. నారం అంటే నీరు. నీటిలో ఉంటాడు కాబట్టి శ్రీమహావిష్ణువుకు నారాయణుడు అని పేరు. నీటినే రూపంగా స్వీకరించి విష్ణువు నీటి విలువను చెప్తున్నాడు. శివుడు ఏకంగా గంగను తన తలపై ధరించి గంగాధరుడయ్యాడు. నీటినివృథా చేయడం సృష్టికి, భగవత్తత్వానికి, సమస్త ప్రాణకోటికి వ్యతిరేకమని పురాణాలు, ప్రాచీన గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి. నీరు మూడు రూపాలలో... ఘన రూపం అంటే మంచు గడ్డల రూపంలోను, ద్రవ రూపం, సముద్రాలు, నదులు, తటకములు మొదలగునవి, వాయు రూపంలో భూమండలం పై 71 శాతానికి పైగా ఆవరించి ఉంది. క్రొత్త క్రొత్త సమ్మేళన పదార్థముల తోను, విష పూరిత రసాయన పదార్థాల తోను నీరు కలుషిత మౌతున్నది. అలా కలుషితమైన జలము జల చక్రము ద్వారా తిరిగి ఆవిరి రూపం ధరిస్తుంది. ఈ క్రమంలో ఆ జలం తనలోని ఇతర కలుషిత పదార్థములను, అనగా రసాయన పదార్థములను కూడా కలుపుకొని వాయు రూపంలో మేఘాలుగా మారి అక్కడి వాతావరణం అనుకూలించ గానే ద్రవించి తిరిగి వర్ష రూపంలో తిరిగి భూమిని చేరుతున్నది. ఆ కలుషిత మేఘాలు వర్షించినపుడు రంగులలో వర్షము కురవడము, ఆమ్ల వర్షాలు కురవడము సర్వ సాధారణము. దాంతో ప్రకృతికి అపార నష్టము జగురుతున్నది.జీవ వ్యవస్థలో నీరు మంచి ద్రావణి, ఇందులో చాలా వరకు లవణాలు కరుగుతాయి. అందుకే దాన్ని విశ్వవ్యాప్త దావణి అంటారు. ఇంచుమించు అన్ని జీవ రసాయనాలు నీటిలో కరుగుతాయి. ఇందువల్ల నీరు జీవ పదార్థాల రవాణాకు తోడ్పడుతుంది. నీటి ఎద్దడిని ప్రపంచంలో 80 దేశాలు ఎదుర్కొంటున్నాయి. గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచి పోవాల్సిన పరిస్థితిలో కూడా ప్రజలు ఉన్నారు. మంచి నీల్లు దొరకక కుంటల్లో, గుంటల్లో అడుగు బొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితిలో ఎంతో మంది ఉన్నారు. వేసవిలో చాలా చోట్ల నీటి కొరత మూలంగా, కనీసం తాగు నీరు దొరకక ఎంతో మంది బిందెలతో బహు దూరం కిలో మీటర్ల వరకు నడిచి వెళ్లి త్రాగు నీటిని తెచ్చుకునే అనివార్య పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. మంచినీటి కంటే సముద్రపు నీరు చాలా ఎక్కువ పరిమాణంలో ఉంది. మనం నివసించే భూగోళంలో ఉన్న నీటి వనరులలో 99% ఉన్నది ఉప్పునీరే. ఇది 97% సముద్రాల్లోనే ఉంది. మిగతాది నదులు, చెరువుల్లో ఉంది త్రాగడానికి పనికొచ్చే నీరు 1% మాత్రమే. ఇందులో చెరువుల్లో 0.86%, నదుల్లో 0.02% ఉండగా మిగిలినవి భూగర్భ జలాలు. ప్రపంచ వ్యాప్తంగా త్రాగడానికి ఉపయోగపడే నీరు 0.3% మాత్రమే.

నీటితో జీవం అంకురించింది. ప్రకృతి మనుగడ నీటితోనే కొనసాగుతోంది. జీవవైవిధ్య పరిరక్షణ. జీవం జలంతోనే సాధ్యమవుతుంది. ఇవన్నీ తెలిసినా..నీటిని వృథా చేస్తున్నాం..నీటి వనరుల్ని వ్యర్థాలతో కలుషితం చేస్తున్నాం. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడి పోతుంటే..మనకు అందుబాటులో ఉన్న నీటిని వృథా చేస్తున్నాం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే..2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన నీరు ఉండనే ఉండదని. ప్రజలు స్నానాలు చేయడం మానేసి శరీరానికి రసాయనిక లేపనాలు రాసుకుంటారనీ..(కెమికల్ బాత్) వాటితోనే స్నానాలు చేస్తారనీ..దేశ సరిహద్దుల్లో కాపలా కాయాల్సిన సైనికులు నీటి వనరుల చుట్టు కాపలా కాసా పరిస్థితి ఉంటుందని.. తలంటు కోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడి గుండుతో జీవిస్తారనీ, స్త్రీ పురుషులందరూ రోజు తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితిని ఎలా ఉంటుందో అంచనా వేయొచ్చు. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా.. ఉన్న నీటిని సద్వినియోగం చేసు కోవడం, వృథాను అరికట్టడం, పొదుపుగా వాడటం, పునర్వి నియోగం..తదితరాలన్నింటికీ ప్రాధాన్య మివ్వాలి.

# అరటిపండు, ఖర్జూరం రెండిటిలో ఆరోగ్యానికి ఏది బెస్ట్?



ఆరోగ్యంగా ఉండాలని కోరుకునే వారు, జిమ్‌కు వెళ్లేవారు లేదా రోజంతా ఉత్సాహంగా ఉండాలనుకునే వారు ఎక్కువగా ఎంచుకునే ఫలాలు అరటిపండ్లు, ఖర్జూరాలు. ఇవి కేవలం తీపిని మాత్రమే కాదు శరీరానికి అవసరమైన తక్షణ ఇంధనాన్ని కూడా అందిస్తాయి. అరటిపండులో కార్బోహైడ్రేట్లు, స్టార్చ్ రూపంలో ఉంటాయి. ఒక సాధారణ అరటిపండు ద్వారా 105 కేలరీల శక్తి అందుతుంది. ఇందులో పొటాషియం, విటమిన్ ꞉6, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. మరోవైపు ఖర్జూరాలు చాలా కాన్సంట్రేటెడ్ శక్తి వనరులు. కేవలం 3 నుంచి 4 ఖర్జూరాలు తిన్నా దాదాపు 90 –120 కేలరీల శక్తి లభిస్తుంది. వీటిలో ఫైబర్, ఇనుము , మెగ్నీషియం మరియు సహజ చక్కెరలు నిండి ఉంటాయి.అరటిపండ్లు: వీటిలో ఉండే ఫైబర్ చక్కెర శోషణను కొద్దిగా నెమ్మదింపజేస్తుంది. దీనివల్ల ఎక్కువ సేపు శక్తిని ఇవ్వడానికి ఇవి సహాయపడతాయి. సుదీర్ఘ నడక లేదా సాధారణ పనులకు ఇవి అనువైనవి. ఖర్జూరాలు: వీటిలో సహజ చక్కెరల శాతం ఎక్కువ. అందువల్ల ఇవి రక్తంలోకి వెంటనే కలిసిపోయి అత్యంత వేగంగా శక్తిని ఇస్తాయి. ఉపవాసం విడిచేటప్పుడు లేదా కఠినమైన వ్యాయామం తర్వాత కోలుకోవడానికి ఇవి బెస్ట్. షుగర్ లెవల్స్‌పై ప్రభావం: అరటిపండ్లు రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెంచవు. వీటి గ్లైసెమిక్ సూచిక మితంగా ఉంటుంది. కానీ ఖర్జూరాలు తిన్నప్పుడు చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. అందుకే డయాబెటిస్ ఉన్నవారు వీటిని మితంగా తీసుకోవడం మంచిది. అయితే ఖర్జూరాల్లో ఉండే ఫైబర్ ఈ ప్రభావాన్ని కొంతవరకు నియంత్రిస్తుంది.

కండరాలకు.. గుండెకు: అరటిపండు కండరాల తిమ్మిర్లను నివారించడంలో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో దీనిలోని పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది. ఖర్జూరం శరీరంలో రక్తం పెరగడానికి , కండరాల పునరుద్ధరణకు, వ్యాధి నిరోధక శక్తిని పెంచే యాంటీ ఆక్సిడెంట్లు దీనిలో మెండుగా ఉంటాయి. మీరు ఎంచుకునే పండు మీ అవసరాలపై ఆధారపడి ఉంటుంది. వ్యాయామానికి ముందు లేదా ఎక్కువ సేపు పనిచేసేటప్పుడు అరటిపండు ఎంచుకోండి. బాగా అలసిపోయినప్పుడు లేదా తీవ్రమైన వర్కవుట్ తర్వాత తక్షణ శక్తి కోసం ఖర్జూరాలు మేలు. అరటిపండు మరియు ఖర్జూరం రెండూ వాటికవే సాటిలేని శక్తి వనరులు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ఈ రెండింటినీ సమతుల్యంగా మీ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అద్భుతమైన ఫలితాలను పొందవచ్చు.

# ఈ కూరగాయతో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు



మన వంటింట్లో తరచూ కనిపించే బీరకాయ కేవలం ఒక కూరగాయ మాత్రమే కాదు. అద్భుతమైన ఔషధ గని. ఆరోగ్యానికి మేలు చేసే విటమిన్ సి, ఐరన్, మెగ్నీషియం, పీచు పదార్థాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఎ, పొటాషియం, ఫోలెట్ వంటి విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అంతేకాకుండా బీరకాయలో నీటి శాతం ఎక్కువగా ఉటుంది. ఇందులో కేలరీల సంఖ్య కూడా తక్కువగా ఉంటుంది. తరచూ దీన్ని ఆహారంలో భాగం చేసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మధుమేహం నియంత్రణ: బీరకాయలో ఉండే కొన్ని ప్రత్యేక పోషకాలు రక్తంలోని చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా 'నేతి బీరకాయ' డయాబెటిస్ రోగులకు ఇన్సులిన్ లాంటి మేలును చేకూరుస్తుంది.జీర్ణక్రియ, మలబద్ధకం: ఇందులో నీటి శాతం మరియు ఫైబర్ (పీచు) అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. దీర్ఘకాలిక మలబద్ధకంతో బాధపడేవారు బీరకాయను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

ఇది పొట్టలోని మలినాలను క్లీన్ చేసి గ్యాస్ సమస్యలను తగ్గిస్తుంది. బరువు తగ్గడం, బెల్లీ ఫ్యాట్: బీరకాయలో క్యాలరీలు చాలా తక్కువ. ఇది తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది, దీనివల్ల అతిగా తినడం తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే వారు మరియు పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును కరిగించుకోవాలనుకునే వారికి ఇది ఒక 'సూపర్ ఫుడ్'.

కంటి చూపు, గుండె ఆరోగ్యం: బీరకాయలో ఉండే బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపరుస్తుంది. అలాగే, ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తపోటును నియంత్రించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది. చర్మ సౌందర్యం: రక్తశుద్ధి చేయడంలో బీరకాయ సహాయపడుతుంది. దీనివల్ల మొటిమలు, మచ్చలు తగ్గి చర్మం కాంతివంతంగా మారుతుంది. లోపలి నుండి శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడం వల్ల చర్మం తాజాగా కనిపిస్తుంది. తక్కువ ధరలో లభించే ఈ బీరకాయను వారంలో కనీసం రెండు సార్లు ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల పైన పేర్కొన్న ఎన్నో ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు.

# ఈ టైంలో పండ్లు తింటే.. రోగాలకు రెడ్ కార్పెట్ వేసి ఆహ్వానించినట్లే!



పండ్లు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయని అందరికీ తెలుసు. అందుకే రోజువారీ ఆహారంలో పండ్లను చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను తొలగించుకోవచ్చు. పండ్లలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తాయి. పండ్లు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయని అందరికీ తెలుసు. అందుకే రోజువారీ ఆహారంలో పండ్లను చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను తొలగించుకోవచ్చు. పండ్లలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తాయి. ఆసక్తికరంగా, పండ్లు కూడా మనల్ని ఎన్నో వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతాయి. అయితే పండ్లు ఏ సమయంలో తింటారు అనే దానిపై ఆరోగ్యానికి వాటి ప్రయోజనాలు అందే విధానం ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా పండ్లు తినే ముందు తగిన శ్రద్ధ చూపకపోతే లేనిపోని ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. తరచుగా పండ్లు తినేటప్పుడు అందరూ చేసే పెద్ద తప్పు.. కడుపు నిండా భోజనం చేసిన తర్వాత పండ్లు తింనడం. అయితే ఇది ఆరోగ్యానికి మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పండ్లలో సహజ చక్కెర అధికంగా ఉంటుంది. మీరు తినే ఆహారం జీర్ణం కావడానికి ఫైబర్ సహాయపడుతుంది. భారీ ఆహారాలలో ప్రోటీన్, కొవ్వు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల భోజనానికి ముందు ఎప్పుడూ పండ్లు తినకూడదు. మీరు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే భోజనం
తర్వాత పండ్లు తినడం మానుకోవాలి. ఉదయం అల్పాహారంగా లేదా మధ్యాహ్నం 4 గంటల ప్రాంతంలో ఆకలిగా ఉన్నప్పుడు పండ్ల ముక్కలు తింటే సరిపోతుంది.

# దిల్లీ క్యాపిటల్స్ కల తీరేనా.. ఈసారైనా?

**ఐపీఎల్ ఆరంభం నుంచి ఉన్న జట్లలో పంజాబ్ కాకుండా టైటిల్ కొట్టలేకపోయిన జట్టు దిల్లీ క్యాపిటల్స్ మాత్రమే. ప్రతిభావంతులకు కొరతలేకపోయినా.. ట్రోఫీ ఆ జట్టుకు అందని ద్రాక్షలానే ఉండిపోయింది. కెప్టెన్లను, కోచ్‌లను, ఆటగాళ్లను మార్చినా.. ఆఖరికి జట్టు పేరు మార్చినా ఫలితం దక్కలేదు. జట్టులో మార్పులు చేర్పులు చేసుకుని బరిలోకి దిగుతున్న దిల్లీ క్యాపిటల్స్.. ఈసారైనా కల నెరవేర్చుకుంటుందా?**

ఇప్పటిదాకా ఐపీఎల్‌లో 18 సీజన్లు జరిగితే... దిల్లీ ఒకే ఒక్కసారి (2020) ఫైనల్ చేరగలిగింది. ప్రదర్శన ఎప్పుడూ అస్థిరమే. 18 సీజన్లలో ఆరుసార్లు మాత్రమే లీగ్ దశను దాటగలిగింది. 2019 నుంచి 2021 వరకు మూడేళ్లు ప్లేఆఫ్స్‌కు చేరి బలమైన జట్టుగా ఎదిగినా.. ఆ తర్వాత మళ్లీ గాడితప్పింది. గత నాలుగేళ్లూ ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టలేకపోయింది. అక్షర్ పటేల్ సారథ్యంలోని దిల్లీ, ఈసారి కూడా గట్టి పోటీదారుల జాబితాలో లేదు. 2025 ఐపీఎల్‌లో ఆరంభంలో వరుస విజయాలు సాధించి, ఫేవరెట్లలో ఒకటిగా మారింది. కానీ గ్రూప్ దశ ఆఖర్లో ఫామ్‌ను కోల్పోయింది. తొలి ఆరు మ్యాచ్‌ల్లో అయిదు నెగ్గిన దిల్లీ.. ఆ తర్వాత ఎనిమిది మ్యాచ్‌ల్లో రెండే గెలిచింది. పాయింట్ల పట్టికలో అయిదో స్థానంతో సరిపెట్టుకున్న ఆ జట్టు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. అయితే నిరుడు లయను కొనసాగించలేకపోయిన ఆ జట్టు ఈసారి మెరుగ్గా కనిపిస్తోంది. అనేకమంది అనుభవజ్ఞులు విఫలమైన నేపథ్యంలో జట్టులో కొన్ని మార్పులు చేసుకుంది. డుప్లెసిస్, జేక్ ఫ్రేజర్ లాంటి బ్యాటర్లను వదిలేసి.. వేలంలో మిల్లర్, బెన్ డకెట్, నిశాంక, ఎంగిడిలను సొంతం చేసుకుంది. రాజస్థాన్ రాయల్స్ నుంచి నితీశ్ రాణాను తీసుకుంది. అయితే ఈసారి కూడా దిల్లీ క్యాపిటల్స్ ప్రధాన జట్టు రాహుల్, అక్షర్ పటేల్, స్టబ్స్, కుల్‌దీప్ యాదవ్, స్టార్క్‌లతో నిర్మితమై ఉంది. మరి బలమైన దేశీ, విదేశీ లైనప్‌లు కలిగి ఉన్న దిల్లీ ఈసారైనా కప్పు కల నెరవేర్చుకుంటుందా అన్నది చూడాలి. ఏప్రిల్ 1న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌తో దిల్లీ టైటిల్ వేట ఆరంభమవుతుంది. హేమంగ్ బదాని ఆ జట్టుకు చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

బలాలు: టాప్ ఆర్డర్‌లో పదే పదే మార్పులు చేయడంతో నిరుడు దిల్లీ క్యాపిటల్స్ దెబ్బతింది. ఎనిమిది భిన్న ఓపెనింగ్ కాంబినేషన్లను ప్రయత్నించడం ఆ ఫ్రాంఛైజీ ప్రణాళిక లోపాన్ని సూచిస్తుంది. డకెట్, నిశాంకల రూపంలో ఈసారి మంచి ఓపెనింగ్ జోడీ దిల్లీకి ఉంది. పృథ్వీ షా కూడా అందుబాటులో ఉన్నాడు. పరిస్థితులను, ప్రత్యర్థిని బట్టి ఓపెనింగ్ జోడీని బరిలోకి దింపవచ్చు. మూడో స్థానంలో కేఎల్ రాహుల్ రూపంలో మేటి బ్యాటర్ ఉన్నాడు. నిరుడు దిల్లీకి వచ్చిన అతను నిలకడగా రాణించాడు. మిల్లర్, స్టబ్స్, అశుతోష్ శర్మలతో దిల్లీ మిడిల్ ఆర్డర్ కూడా బలంగా ఉంది. వీళ్లు బంతిని బాగా బాదగలరు. కానీ దిల్లీ ప్రధాన బలం మాత్రం బౌలింగే. స్టార్క్, కుల్‌దీప్, ఎంగిడి, నటరాజన్‌ల రూపంలో వికెట్లు తీయగల బౌలర్లు దిల్లీకి ఉన్నారు. వాళ్లకు తోడు కశ్మీర్ స్టార్ ఆకిబ్ నబి కూడా సత్తా చాటడానికి సిద్ధమవుతున్నాడు. అతణ్ని వేలంలో రూ.8.4 కోట్లకు దిల్లీ సొంతం చేసుకుందంటే తన



సామర్థ్యంపై గట్టి నమ్మకమున్నట్లే. బంతితో, బ్యాటుతో సత్తా చాటగల అక్షర్ పటేల్ జట్టుకు పెద్ద బలం.

బలహీనతలు: ఓపెనింగ్ ప్రత్యామ్నాయాలు పేపర్‌పై బలంగానే కనిపిస్తున్నా.. ఖరారైన తొలి ప్రాధాన్య ఓపెనింగ్ జంట లేదు. డకెట్, నిశాంక, పృథ్వీ షా అస్థిర ఫామ్‌తో టోర్నీలో అడుగుపెడుతున్నారు. పేస్ బౌలింగ్‌లో ఎక్కువగా విదేశీయులపైనే దిల్లీ ఆధారపడి ఉంది. ఒకవేళ స్టార్క్, ఎంగిడి అందుబాటులో లేకపోయినా లేదా ఫామ్ కోల్పోయినా.. 2025లోలా డీసీ ఇబ్బందుల్లో పడొచ్చు. దేశీ ఫాస్ట్‌బౌలర్లపై ఒత్తిడి పెరుగుతుంది. నిరుడు ముకేశ్ ఆఖరి ఓవర్లలో నిలడకగా రాణించలేకపోయాడు. కొత్త పేసర్ ఆకిబ్ నబి దేశవాళీ ఫామ్‌ను ఐపీఎల్‌లో పునరావృతం చేయలేకపోతే దిల్లీ సమతూకం దెబ్బతినొచ్చు. ఒత్తిడికి నిలవడం కూడా దిల్లీకి పెద్ద సవాలే. ఆఖరి ఓవర్లలో పేలవ బౌలింగ్, బ్యాటింగ్‌లో కుప్పకూలడంతో గత సీజన్‌లో హోరాహోరీ సమరాల్లో ఆ జట్టు దెబ్బతింది. ఈసారి ఆ బలహీనతను ఎలా అధిగమిస్తుందో చూడాలి.

దేశీయ ఆటగాళ్లు: కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్, సాహిల్ ప్రకాశ్, పృథ్వీ షా, అభిషేక్ పోరెల్, అక్షర్ పటేల్, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ, విప్రాజ్ నిగమ్, అజయ్ మండల్, త్రిపురణ విజయ్, మాధవ్, ఆకిబ్ నబి, నితీశ్ రాణా, నటరాజన్, ముకేశ్ కుమార్, కుల్‌దీప్ యాదవ్.

విదేశీయులు: డేవిడ్ మిల్లర్, బెన్ డకెట్, నిశాంక, స్టబ్స్, స్టార్క్, చమీర, ఎంగిడి, జేమీసన్;

వీళ్లు కీలకం: అక్షర్ పటేల్, రాహుల్, స్టబ్స్, స్టార్క్, కుల్‌దీప్ యాదవ్;

ఉత్తమ ప్రదర్శన: 2020లో రన్నరప్

# ఇప్పుడుంది అసలు సవాల్



మెరుపు ఆటతో పాకెట్ డైనమోగా పేరు తెచ్చుకుని కెరీర్ ఆరంభంలోనే వన్డేల్లో డబుల్ సెంచరీతో మెరిశాడు ఇషాన్ కిషన్. ఆ తర్వాత క్రమశిక్షణ తప్పి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయి టీమ్ఇండియాకు దూరమయ్యాడు. కానీ అతడికి త్వరగానే రెండో అవకాశం దక్కింది. తప్పులు దిద్దుకుని మళ్లీ జట్టులోకి రావడమే కాదు.. తాజా టీ20 ప్రపంచకప్‌లో మెరుపులతో జట్టు విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. 2026 ఐపీఎల్‌లో ప్యాట్ కమిన్స్ గాయంతో కొన్ని మ్యాచ్‌లకు దూరం కావడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును నడిపించే అవకాశాన్ని అందుకున్నాడు ఇషాన్. గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఝార్ఖండ్‌ను విజేతగా నిలబెట్టిన ఇషాన్.. ఐపీఎల్ సవాలును ఎలా ఎదుర్కొంటాడన్నది ఆసక్తికరం.

**అంత తేలిక కాదు**

2024 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రదర్శన ఒక చరిత్ర. విధ్వంసక బ్యాటింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తూ.. ప్రత్యర్థి జట్లను బెంబేలెత్తించేసింది ఆ జట్టు. ఎస్ఆర్‌హెచ్ ధాటికి ఐపీఎల్ అత్యధిక స్కోరు రికార్డు నాలుగుసార్లు బద్దలైంది. ఆ సీజన్లో ఫైనల్‌కు దూసుకెళ్లిన సన్‌రైజర్స్ త్రుటిలో టైటిల్ కోల్పోయింది. కానీ గత ఏడాది భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన ఆ జట్టు.. తీవ్రంగా నిరాశపరిచింది. కానీ ఈసారి మళ్లీ ఆ జట్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, క్లాసెన్, ఇషాన్ కిషన్ లాంటి విధ్వంసకారులతో నిండిన టీమ్ బ్యాటింగే బలంగా బరిలోకి దిగుతోంది. మరి ఈ జట్టును ఇషాన్ ఎలా ముందుకు తీసుకెళ్తాడో చూడాలి. గతేడాది రూ.11.25 కోట్లతో ఇషాన్‌ను దక్కించుకుంది సన్‌రైజర్స్. అందుకు తగ్గట్టే ఆడిన తొలి మ్యాచ్‌లోనే మెరుపు సెంచరీ (47 బంతుల్లోనే 106 నాటౌట్)తో అదరగొట్టాడు. ఆ తర్వాత ఆ స్థాయిలో రాణించకపోయినా.. కీలక పరుగులు చేశాడు. అదే ఏడాది ఝార్ఖండ్ కెప్టెన్‌గానూ సత్తా చాటాడు ఇషాన్. ఏమాత్రం అంచనాలు లేకుండా ముస్తాక్ అలీ టోర్నీలో జట్టును సమర్థంగా నడిపించాడు. ఝార్ఖండ్‌కు తొలిసారి టైటిల్ అందించాడు.

# డ్రాగన్ టీమ్ ప్లాన్ మామూలుగా లేదుగా!

ఇజ్రాయెల్, అమెరికా మిలిటరీ దాడుల నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ, జోర్డాన్‌లో ఉన్న ఇండియన్స్‌కు అఫీషియల్ అడ్వైజరీ జారీ కావడంతో సినీ వర్గాల్లో ఒక్కసారిగా చర్చ మొదలైంది. ముఖ్యంగా ఎన్టీఆర్– ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్టు డ్రాగన్ షూటింగ్ పై ఎన్నో రూమర్లు వినిపించాయి. కానీ రియాలిటీలో సిట్యుయేషన్ మాత్రం పూర్తి భిన్నంగా ఉంది.



**పరిస్థితులను ముందే అంచనా వేసిన మేకర్స్**

ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, ఎన్టీఆర్– నీల్ సినిమాకు సంబంధించి జోర్డాన్‌లో జరగాల్సిన కీలక షెడ్యూల్‌ను చిత్రబృందం ముందుగానే పూర్తి చేసినట్టు తెలుస్తోంది. అసలు ప్లాన్ ప్రకారం ఈ షెడ్యూల్ మార్చి ఫస్ట్ వీక్ వరకు కొనసాగాల్సి ఉన్నా, పరిస్థితులను ముందే బేరీజు వేసిన చిత్ర యూనిట్ ఫిబ్రవరి 25కే షూటింగ్‌ను ముగించి ఇండియాకు తిరిగొచ్చింది. అంతర్జాతీయ పరిస్థితులు క్షణక్షణం మారుతున్న నేపథ్యంలో ఈ ముందస్తు నిర్ణయం ఇప్పుడు టీమ్‌కు పెద్ద రిలీఫ్‌గా మారింది.

భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ప్రాజెక్టుల్లో లాజిస్టిక్స్, భద్రత, వాతావరణం లాంటి అంశాలు కీలకం. ముఖ్యంగా విదేశీ షూటింగ్‌లలో ఒక చిన్న అంతరాయం కూడా కోట్ల రూపాయల నష్టానికి దారితీసే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భంలో ముందుగానే జాగ్రత్తలు తీసుకుని షెడ్యూల్‌ను వేగంగా పూర్తి చేయడం ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ సామర్థ్యాన్ని చూపిస్తోంది.

**షూటింగ్ నిలిచిపోయిందని వార్తలు**

ఇదిలా ఉంటే జోర్డాన్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయన్న వార్తలతో సోషల్ మీడియాలో డ్రాగన్ షూట్ నిలిచిపోయిందని, టీమ్ అక్కడే చిక్కుకుపోయిందని పలు ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. మూవీ ఇప్పటికే కొంత ఆలస్యాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ పరిణామం మరింత ఆలస్యానికి దారి తీస్తుందనే చర్చలు కూడా వినిపించాయి.

**రూమర్స్ ‌ఙం రియాలిటీ**

కానీ డ్రాగన్ మూవీ జోర్డాన్ షూటింగ్ షెడ్యూల్ ఇప్పటికే పూర్తైంది. ఇక ఈ మూవీకి సంబంధించిన బ్యాలెన్స్ షూటింగ్ ఇండియాలోనే జరగాల్సి ఉంది. అంటే ప్రస్తుత పరిస్థితులు ఈ సినిమాపై ఎలాంటి ప్రభావం చూపే అవకాశం లేదని స్పష్టమవుతోంది. ఇలా రూమర్లకు చెక్ పడటమే కాకుండా, యూనిట్ ముందస్తు ప్రణాళిక ఎంత పక్కాగా ఉందో కూడా దీన్ని బట్టి క్లారిటీ వచ్చింది. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కు పలు భారీ ప్రాజెక్టులను సమర్థవంతంగా నిర్వహించిన అనుభవముంది. మారుతున్న పరిస్థితులను ముందుగానే అంచనా వేసి షెడ్యూల్ ను రీ అరేంజ్ చేయడం, భద్రతా అంశాలను ప్రాధాన్యత ఇవ్వడం లాంటి నిర్ణయాలు వారి ప్రొఫెషనలిజాన్ని మరోసారి ఋజువు చేస్తున్నాయి. మొత్తానికి, అంతర్జాతీయ ఉద్రిక్తతల మధ్య ఊహాగానాలు చెలరేగినా, ప్రీ ప్లానింగ్ వల్ల ఈ భారీ ప్రాజెక్ట్ ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగుతోంది. రూమర్లకు బదులుగా వాస్తవం ఏమిటో స్పష్టమవడంతో అభిమానులు కూడా ఊపిరి పీల్చుకుంటున్నారు. రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.



శ్రీదేవి పూల సొగసులో గ్రేస్‌ని వెదజల్లుతుంది

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com